ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

సోమవారం 22 జూన్ 2026 సంపుటి: 1 సంచిక: 5 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad


## 70 ఏళ్లలోనూ యవ్వనంగా..

### యోగా డేలో సీక్రెట్ చెప్పిన ప్రధాని మోదీ!

పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోదీ పలు కీలక సూచనలు చేశారు. యోగా అనేది సంవత్సరంలో ఒక రోజులా మారకూడదని.. జీవితంలో ఒక భాగమవ్వాలని పిలుపునిచ్చారు. 70 ఏళ్ల వయస్సులోనూ రోగాల బారి నుంచి కాపాడుకోవాలంటే యోగాని ప్రాక్టీస్ చేయాలని సూచించారు.

న్యూఢిల్లీ, జూన్ 21 (సింగిడి)



2




## టి-ఫైబర్‌కు ప్రతిష్ఠాత్మక 'స్కోచ్' అవార్డు

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సమానత్వాన్ని సాధించే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలకు గుర్తింపు లభించింది.

హైదరాబాద్, జూన్ 21 (సింగిడి)

2



### భారత నౌకాదళంలోకి

# మూడు యుద్ధ నౌకలు

### జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

- దూనగిరి, సంశోధక్, అగ్రే నౌకలతో పెరగనున్న నావికాదళ సామర్థ్యం
- రక్షణ రంగంలో భారత్ కొనుగోలుదారుగా ఉండబోదని స్పష్టం చేసిన ప్రధాని
- యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక సామర్థ్యాలను పెంచనున్న కొత్త నౌకలు

2

భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు.

- కోల్‌కతా, సింగిడి

## 45 నిమిషాల పాటు

# ఎయిర్‌పోర్టులోనే మోదీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ విమానాశ్రయంలోనే 45 నిమిషాల పాటు ఉండిపోయారు. నీట్-యూజీ రీ-ఎగ్జామ్ హాజరయ్యే విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు పడకుండా.. ట్రాఫిక్ సాఫీగా సాగేలా చూడటం కోసం ప్రధాని.. ఢిల్లీ విమానాశ్రయంలోనే కాసేపు వేచి ఉన్నారు.

- న్యూఢిల్లీ, సింగిడి



2

# లంచం... లంచం... లంచం...

## డబ్బుల రుచి మరిగిన పిశాచాలు

**ప్రభుత్వ ఉద్యోగం ఒకప్పుడు సేవకు ప్రతీకగా భావించేవారు. ఇప్పుడు కొన్ని శాఖల్లో మాత్రం అది కొందరికి అక్రమ సంపాదనకు అడ్డాగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.**

**హైదరాబాద్, జూన్ 21 (ప్రత్యేకప్రతినిధి- సింగిడి):**




### అన్ని శాఖల్లోనూ తిష్ట.. కోట్లలో ఆస్తులు

### ఏసీబీ తనిఖీల్లో బట్టబయలు.. ఈ ఏడాది ఇప్పటికే 83 కేసులు

**నెలకు లక్షల్లో జీతాలు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ కొందరు అధికారులు లంచాల మత్తులో మునిగిపోతున్నారు. ప్రజల అవసరాలు, అత్యవసర పనులను అడ్డు పెట్టుకుని బల్ల కింద చేతులు చాపడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

ఒక సాధారణ ధృవీకరణ పత్రం కావాలన్నా, భూమి రికార్డు సరిచేయించుకోవాలన్నా, అనుమతి పొందాలన్నా, బిల్లు క్లియర్ చేయించుకోవాలన్నా లంచం లేకుండా పని జరగడం కష్టమనే భావన ప్రజల్లో బలపడుతోంది. నిబంధనల ప్రకారం పని చేయాలని అడిగితే ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో పడేయడం, అభ్యర్థులను కార్యాలయాల చుట్టూ తిప్పడం, చివరకు విసిగించి డబ్బులు తీసుకోవడమే కొందరి పనితీరుగా మారిందని బాధితులు వాపోతున్నారు.

#### ఇవ్వకపోతే ఫైలే కదలదు..!

ప్రస్తుతం పలు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడిన పరిస్థితి ప్రజలను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. పని కోసం వచ్చిన వారిని గంటల తరబడి వేచి ఉండేలా చేయడం, చిన్న చిన్న కారణాలు చూపిస్తూ ఫైళ్లను నిలిపివేయడం, చివరకు మధ్యవర్తుల ద్వారా సంకేతాలు పంపించడం వంటి ఘటనలు సాధారణమవుతున్నాయి. "చేస్తాం... చూస్తాం..." అనే మాటలతో కాలయాపన చేసి, చివరకు 'రేటు' నిర్ణయించిన తర్వాతే ఫైలు కదిలే పరిస్థితులు ఏర్పడ్డాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలు, రైతులు, వృద్ధులు, చిన్న వ్యాపారులు ఈ అవినీతి భారాన్ని ఎక్కువగా భరిస్తున్న వర్గాలుగా కనిపిస్తున్నారు.

**రోజుకు లక్షల్లో సంపాదన..**

ఏసీబీ దాడుల్లో బయటపడుతున్న ఆస్తులు చూస్తే అవినీతి ఏ స్థాయికి చేరుకుందో అర్థమవుతోంది. ప్రభుత్వ వేతనాలతో ఎన్నో తరాలు కూడబెట్టలేని ఆస్తులు కొందరు అధికారులు కొన్నేళ్లలోనే సృష్టించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని కేసుల్లో అధికారులు రోజుకు లక్షల్లో అక్రమ ఆదాయం పొందుతున్నట్లు విచారణల్లో బయటపడిన అంశాలు సంచలనం రేపాయి. కొందరి ఇళ్లలో కోట్ల రూపాయల నగదు, బంగారం, వజ్రాభరణాలు, విలాసవంతమైన భవనాలు, వ్యవసాయ భూములు, ప్లాట్లు, పెట్టుబడులు బయటపడటం ప్రజలను విస్తుపోయేలా చేస్తోంది.

**ప్రజల్లో పెరిగిన చైతన్యం.. పెరుగుతున్న కేసులు**

ఒకప్పుడు ప్రభుత్వ అధికారులపై ఫిర్యాదు చేయడానికి ప్రజలు భయపడేవారు. అయితే ఇటీవలి కాలంలో పరిస్థితి మారుతోంది. లంచాల డిమాండ్లు వేల రూపాయల నుంచి లక్షలకు చేరుకోవడంతో బాధితులు గత్యంతరం లేక అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను ఆశ్రయిస్తున్నారు.

దీంతో ఏటా నమోదవుతున్న ట్రాప్ కేసులు, అక్రమాస్తుల కేసుల సంఖ్య పెరుగుతోంది. అధికారులు పట్టుబడుతున్నా, అరెస్టవుతున్నా, జైలుకు వెళ్తున్నా అవినీతి మాత్రం తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

#### ఏసీబీ గణాంకాలే చెబుతున్న వాస్తవం

గత నాలుగేళ్లుగా నమోదైన కేసుల సంఖ్య పరిశీలిస్తే అవినీతి తీవ్రత స్పష్టమవుతోంది.


| సంవత్సరం | | నమోదైన కేసులు |
| --- | --- | --- |
| 2026. | – | 83 |
| 2025 | – | 199 |
| 2024. | – | 152 |
| 2023 | – | 95 (జూన్ వరకు) |

ఈ గణాంకాలు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఎంత లోతుగా పాతుకుపోయిందో సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇటీవల చిక్కిన తిమింగలాలు... సంచలనంగా నరహరి కేసు**

ల్యాండ్ అండ్ సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసాలు, లాకర్లలో నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. నగదు కట్టలు, బంగారు బిస్కెట్లు, వజ్రాభరణాలు, విలువైన స్థిరాస్తులు వెలుగుచూశాయి. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.100 కోట్లకు

...మిగతా 2లో



### ముంబైలో విజృంభిస్తున్న

# కోవిడ్, స్వైన్ ఫ్లూ

- రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల
- తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు
- యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

2

# మూడ్రోజులు ఢిల్లీలోనే..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్..

రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రేవంత్ లేఖ

**హైదరాబాద్, జూన్ 21 (సింగిడి)**

ఎన్సీపీ(ఎస్పీ) నేత శరద్‌పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్‌కు శనివారం ముంబయి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం వెళ్లారు. సోమ, మంగళవారాలు అక్కడే ఉండి పలు అంశాలపై కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఇందులో భాగంగా మెట్రోకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం, రెండోదశ గురించి చర్చించేందుకు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా లేఖ రాశారు. 22, 23 తేదీల్లో సమయమిస్తే ఇద్దరం కలిసి వెళ్లి హైదరాబాద్, తెలంగాణకు అతి ముఖ్యమైన ఈ రెండు అంశాల గురించి చర్చిద్దామని, సమయం ఖరారు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో అంశంలో మీ జోక్యాన్ని కోరుతూ అన్ని వివరాలతో 16న లేఖ రాశానని, సమావేశం ఏర్పాటు చేయిస్తే అవసరమైన రికార్డులు, వాస్తవాలు సమర్పిస్తానని సీఎం తాజా లేఖలో చెప్పారు. అన్ని ఒప్పందాలు, అనుబంధ డాక్యుమెంట్లను కూడా తనతో పాటు తీసుకొస్తున్నానని పేర్కొన్నారు.





# సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్

### తమిళనాడులో దుర్ఘటన ఏడుగురు కార్మికుల మృతి

- 74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం
- యూనిట్‌లో వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం
- ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**చెన్నై, జూన్ 21 (సింగిడి)**

తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు

...మిగతా 2లో

# చెట్టును ఢీకొట్టిన కారు..

### భార్యాభర్తలు, కుమారుడి మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదారం అటవీ ప్రాంతంలో ఘటన

2






# తప్పిన పెను ప్రమాదం

- ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు
- డ్రైవర్ అప్రమత్తతతో 41 మంది సేఫ్
- కరీంనగర్‌లో ఘటన

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

2

- కరీంనగర్, జూన్ 21 (సింగిడి)

## 11 బంతుల్లోనే

# అర్ధసెంచరీ!

### లిస్ట్-ఎ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ నయా వరల్డ్ రికార్డ్

భారత యువ క్రికెట్ సంచలనం, 15 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచం అబ్బురపడేలా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. శ్రీలంకలోని రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక 'ఎ' జట్టుతో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో 11 బంతుల్లోనే అర్ధ సెంచరీ మార్కును దాటి, లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేసిన బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు.

2



### తెలంగాణ కోటాలో

# రాజ్యసభ సీటు తీసుకోలేను

### క్లారిటీ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్

**మధ్య ప్రదేశ్ నుంచే రాజకీయాలు చేస్తానని ప్రకటన**

**మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి తాను దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు.**

**హైదరాబాద్, జూన్ 21 (సింగిడి)**



తనపై ప్రస్తుతం ఎలాంటి లీగల్ కేసులు లేవని, చట్టబద్ధంగా తాను అన్ని నిబంధనలను పాటించానని స్పష్టం చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఒక పాత కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికార బీజేపీ, ఈసీ లాలూచీపడి, కుట్రపూరితంగా తన

...మిగతా 2లో

### ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి...

# రాబోయేది మన ప్రభుత్వమే

హనుమాన్ నగర్ బస్తీవాసులకు కేటీఆర్ భరోసా

2



### సైబర్ బాధితులకు

# రూ.45.21 కోట్లు రిఫండ్

ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6,303 మందికి...

2

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
22 జూన్ 2026

# భారత నౌకాదళంలోకి మూడు యుద్ధ నౌకలు

ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత



స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోదీ తెలిపారు.

మూడు నౌకల ప్రత్యేకతలు

దూనగిరి: ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.

సంశోధక్: ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

అగ్రే: ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

# లంచం... లంచం... లంచం...

మొదటి పేజీ తరువాయి

పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఆర్ అండ్ బీ శాఖలో భారీ ఆస్తులు**

ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్‌కు సంబంధించిన సోదాల్లో సుమారు రూ.17.94 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించబడ్డాయి. ఈ వ్యవహారం కూడా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**డిప్యూటీ కలెక్టర్ కేసు సైతం...**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్‌పై నమోదైన కేసు సైతం సంచలనం సృష్టించింది. ఏసీబీ దర్యాప్తులో ఆయనకు సంబంధించి రూ.100 కోట్లకు పైగా విలువైన ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**భయం పోయిందా..? ఆశ పెరిగిందా..?**

ఒకప్పుడు ఏసీబీ పేరు వినగానే వణికిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు వరుసగా అధికారులు పట్టుబడుతున్నా అవినీతి తగ్గకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. శిక్షల భయం తగ్గిందా? రాజకీయ, అధికార అండలపై నమ్మకం పెరిగిందా? లేక అక్రమ సంపాదనపై ఆశే అన్ని హద్దులు దాటిస్తోందా? అనే చర్చ సాగుతోంది.

**ప్రక్షాళన అవసరం ....**

అవినీతిని పూర్తిగా అరికట్టాలంటే కేవలం ఏసీబీ దాడులు సరిపోవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయడం, ఫైల్ ట్రాకింగ్ వ్యవస్థను పారదర్శకంగా మార్చడం, అక్రమాస్తుల కేసుల్లో వేగవంతమైన విచారణలు, కఠిన శిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే పరిస్థితుల్లో మార్పు సాధ్యమవుతుందని చెబుతున్నారు.

ప్రజలకు సేవ చేయాల్సిన వ్యవస్థలో కొందరు అవినీతి తిమింగలాలు పెత్తనం చేస్తుంటే, దాని మూల్యం చెల్లించేది చివరకు సామాన్య ప్రజలేనన్నది కఠోర వాస్తవం.

# తెలంగాణ కోటాలో రాజ్యసభ సీటు తీసుకోలేను

మొదటి పేజీ తరువాయి

నామినేషన్‌ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తన రాజ్యసభ సీటు తీవ్రమైన కుట్రతో చోరీకి గురైందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువులకు విరుద్ధంగా చేస్తున్న కుట్రలను, అక్రమాలను సమాజానికి విడమరిచి చెప్పడానికే తాము ఈ లీగల్ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లు తనకోసం మరొకరితో బలవంతంగా రాజీనామా చేయించి, తెలంగాణ కోటాలో తాను రాజ్యసభ సీటును తీసుకోలేనని చెప్పారు. తాను పుట్టి పెరిగింది, రాజకీయాలు చేసింది మధ్యప్రదేశ్‌లోనే కాబట్టి ఆ రాష్ట్ర ప్రజల తరఫునే తాను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని తేల్చి చెప్పారు.కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత శత్రువులే మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను ప్రత్యర్థి పార్టీకి అందించారంటూ వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలే ప్రత్యర్థులకు ఇచ్చారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. బీజేపీ తన ఓటమి భయంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపిందని విమర్శించారు. అఫిడవిట్‌లో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన నామినేషన్ తిరస్కరించాల్సిన అవసరం లేదని.. దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. స్క్రూటినీ జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను నామినేషన్ రూమ్‌లోకి అధికారులు ఎందుకు అనుమతించారని ఆమె ఈసీని నిలదీశారు. కాగా, మీనాక్షి నటరాజన్ గతంలో రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలక నేతగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా కూడా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. ఈ నామినేషన్ తిరస్కరణ అంశం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ తిరస్కరణను కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తుండగా.. నిబంధనల ప్రకారమే ఈసీ నిర్ణయం తీసుకుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ లీగల్ టీమ్ ఇప్పటికే కసరత్తు చేస్తోంది.

ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి...

# రాబోయేది మన ప్రభుత్వమే

## హనుమాన్ నగర్ బస్తీవాసులకు కేటీఆర్ భరోసా

**హైదరాబాద్, జూన్ 21 (సింగిడి)**

అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను “గుంపు మేస్త్రి” అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన “బస్తీ బాట” కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించి, ఆ భూములను ప్రభుత్వం అమ్మేసుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బస్తీ వాసులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పట్టాలను కూడా రద్దు చేసి, తమ భూములను లాక్కోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయింది. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో లూటీలు జరుగుతున్నాయి.. కానీ హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. హనుమాన్ నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు.

ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు కూడా లేవని కేటీఆర్ అన్నారు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి... మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోండి... కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు.

పెద్దలకు ఒక నీతి... పేదలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

మేమంతా మీకు అండగా ఉంటాం... ఎవ్వరూ భయపడకండని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు.



# 11 బంతుల్లోనే అర్ధసెంచరీ!

టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ.. వైభవ్ తన అటాకింగ్ బ్యాటింగ్‌తో స్టేడియం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 94 పరుగులు చేసిన సూర్యవంశీ శ్రీలంక కెప్టెన్ సహన్ అరాచ్చిగే బౌలింగ్‌లో వియాస్కాంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (24 బంతుల్లో 37)తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన సూర్యవంశీ కేవలం 6.3 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 104 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచాడు. ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటిన ఈ బీహార్ కుర్రాడి దూకుడు ముందు కుగదాస్ మథులన్ వంటి లంక ప్రధాన బౌలర్లు సైతం చేతులెత్తేశారు. కెప్టెన్ తిలక్ వర్మ, సీనియర్ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌లతో కూడిన భారత్ 'ఎ' జట్టు ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ టైటిల్ దిశగా దూసుకుపోతోంది. ఈ మ్యాచ్ కేవలం ఫైనల్ మాత్రమే కాకుండా ఇరు జట్ల మధ్య ఉన్న పాత పగలకు వేదికగా మారింది. జూన్ 15న జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 'ఎ' జట్టు వివాదాస్పద రీతిలో సూపర్ ఓవర్ గెలిచిన అనంతరం వైభవ్‌ను రెచ్చగొట్టడం, ఆపై మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఘర్షణ జరగడం తెలిసిందే. ఆ ఘటనలో వైభవ్‌కు జరిమానా పడినప్పటికీ.. నేడు దానికి తన పవర్‌ఫుల్ బ్యాటింగ్‌తోనే లంకకు సమాధానం ఇచ్చి ప్రతీకారం తీర్చుకున్నాడు. లీగ్ దశలో అఫ్ఘనిస్తాన్‌పై 101 పరుగుల భారీ విజయం సాధించి ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్.. ఈ ఫైనల్లో లంకకు సొంత గడ్డపైనే చుక్కలు చూపిస్తోంది.

# 45 నిమిషాల పాటు ఎయిర్‌పోర్టులోనే మోదీ

పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని మోదీ తన తిరుగు ప్రయాణాన్ని కాస్త ఆలస్యం చేసుకున్నారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్రధాని మధ్యాహ్నం 1:15 గంటల ప్రాంతంలో ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండటంతో ఆయన విమానాశ్రయం నుండి వెంటనే తన నివాసానికి బయలుదేరడానికి బదులుగా.. అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. విమానాశ్రయం నుండి ప్రధాని కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిలిపివేస్తారు. దీంతో రోడ్లపై ట్రాఫిక్ జామ్‌తో విద్యార్థులు పరీక్షకు ఆలస్యం కాకూడదని.. పరీక్షా ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ఎయిర్ పోర్టు నుంచి బయటకు వెళ్లారు. దేశంలో వైద్యవిద్య ప్రవేశాల భవిష్యత్‌ను నిర్ణయించే నీట్-యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం నిర్వహించారు. గత నెల 3వ తేదీన నిర్వహించిన పరీక్ష.. పేపర్ లీక్, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో రద్దు కావడంతో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు మరోసారి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నేడు నీట్ రీఎగ్జామ్ నిర్వహిస్తోంది. తెలంగాణలో సుమారు 73 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-పేపర విధానంలో పరీక్ష నిర్వహించారు. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాలతోపాటు విదేశాల్లోని 14 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

# ముంబైలో విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ

**ముంబై, జూన్ 21 (సింగిడి)**

రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ (H1N1), ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

# సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్

మొదటి పేజీ తరువాయి

తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియ పాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

# చెట్టును ఢీకొట్టిన కారు..

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 21 (సింగిడి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మాదారం అటవీ ప్రాంతంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయిన వారు ముసలిమడుగు గ్రామానికి చెందిన దంపతులు సాయి(25), సంధ్య(23)తో పాటు చిన్నారి మోక్షిత్ (4)లుగా గుర్తించారు.

# 70 ఏళ్లలోనూ యవ్వనంగా..

యోగా 365 కార్యక్రమాన్ని ప్రారంభించామని.. యువతతో పాటు అందరూ పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా పెద్ద ఎత్తున నిర్వహించిన ఈ యోగా డేలో వేలాది మంది పాల్గొన్నారు. ఉదయం 6:30 గంటలకే ఈ కార్యక్రమానికి చేరుకున్న మోదీ.. యోగా చేస్తే వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. యోగా కేవలం వ్యక్తిగత జీవితాన్ని మెరుగుపరచడానికే కాదని, ప్రపంచ భవిష్యత్ కోసం కూడా అవసరమంటూ ప్రధాని మోదీ ప్రసంగించారు. యోగా అనేది ప్రపంచాన్ని భారతదేశంతో అనుసంధానించిందని, ఇది మనుషులను ఒక్కటి చేస్తుందని ప్రధాని అన్నారు. జూన్ 21 ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా మారిందని చెప్పారు. స్వామీ వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, శ్రీ అరబిందో వంటి మహనీయులు పుట్టిన గడ్డపై యోగా కార్యక్రమంలో పాల్గొనడం గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి ఇస్తోందని ప్రధాని అన్నారు. యోగా డేలో ప్రధాని మోదీ మాట్లాడిన ప్రసంగాల్లో ఇదే హైలెట్‌గా నిలిచింది. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందన్నారు. 50 ఏళ్ల వయస్సులో 30 ఏళ్ల కంటే ఎక్కువ ఉత్సాహంగా ఉండాలని, 70 ఏళ్లలో ఎక్కువ వ్యాధులను ఎదుర్కోగలగాలి అంటే అది యోగాతోనే సాధ్యపడుతుందన్నారు. "వయస్సు పెరిగినంత మాత్రాన మనిషి సామర్థ్యం తగ్గిపోదు. 50 ఏళ్ల వయస్సులో 30 ఏళ్ల కంటే ఎక్కువ ఉత్సాహంగా ఉండాలి. 70 ఏళ్ల వయస్సులో 50 ఏళ్ల కంటే ఎక్కువ వ్యాధులను ఎదుర్కోగలగాలి. అందుకు యోగా ఉపయోగపడుతుంది. యోగా మన శరీరం, మనస్సును అర్థం చేసుకునే జీవితకాల అధ్యయనం లాంటిది" అని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని ప్రస్తావిస్తూ యోగా కేవలం శారీరక వ్యాయం కాదు, మానసిక ఆరోగ్యానికి కూడా మార్గం చూపుతుంది. ఏం చేయాలి, ఏం చేయకూడదు అనేది కూడా నేర్పుతుంది అని చెప్పారు. ప్రపంచ శాంతి, మానవ సంక్షేమానికి యోగా దోహదపడుతుందని చెప్పారు. యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమంగా మిగిలిపోకూడదని.. మన జీవితంలో ఒక భాగం కావాలని మోదీ పిలుపునిచ్చారు.

# బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

**హైదరాబాద్, జూన్ 21 (సింగిడి):**

క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది.

# తప్పిన పెను ప్రమాదం

వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.



# టి-ఫైబర్‌కు ప్రతిష్ఠాత్మక 'స్కోచ్' అవార్డు

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడం, ఈ-గవర్నెన్స్ సేవలకు బలమైన మౌలిక వసతులు కల్పించడంలో విశేష కృషి చేసిన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ (టి-ఫైబర్) ప్రతిష్ఠాత్మక 'స్కోచ్ అవార్డు-2026'ను కైవసం చేసుకుంది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును టి-ఫైబర్ బృందం అందుకుంది. అవార్డును అందుకున్న అనంతరం టి-ఫైబర్ బృందం సభ్యులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, టి-ఫైబర్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి అవార్డును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు చేపట్టిన కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ఏఐ ఆధారిత అభ్యాసం, రైతు వేదికలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ కల్పించడం వంటి అంశాల్లో టి-ఫైబర్ పోషిస్తున్న పాత్రను వివరించారు. టి-ఫైబర్ సాధించిన ఈ అవార్డు పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పరివర్తనకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి కుటుంబానికి అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు, గృహాలకు టి-ఫైబర్ సేవలను మరింత వేగంగా విస్తరించాలని అధికారులను ఆదేశించారు

# సైబర్ బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్

**హైదరాబాద్, జూన్ 21 (సింగిడి)**

ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్ చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2,232 మందికి చెందిన రూ.21.91 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి రూ.6.83 కోట్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు రికవరీలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు నుంచి ఇప్పటివరకు 59,953 మంది బాధితులకు రూ.445.41 కోట్లు రిఫండ్ అయినట్లు తెలిపారు. 2026లో జూన్ 20 వరకు రూ.70.07 కోట్లు సైబర్ మోసగాళ్ల నుంచి రికవరీ చేసినట్లు వివరించారు. యూపీఐ, ఇన్వెస్ట్‌మెంట్, ఇంపర్సనేషన్ స్కామ్‌ల బాధితులకు వేగంగా న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్/ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

# అన్నపూర్ణ రాష్ట్రాన్ని ఆకలి రాష్ట్రంగా చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

**మంత్రుల మాటలతో అయోమయానికి గురవుతున్న రైతులు**
**రైతులు వేసే ఏ సన్నరకం వరిపంటనైనా కొనుగోలు చేయాల్సిందే**
**దేవుని మీద ఒట్లు వేయడంతోనే ప్రకృతి కూడా సహకరిస్తలేదు**
**మీటింగ్‌లకు పెట్టే ఖర్చులతో రైతు బంధు అమలు చేయచ్చు**
**మార్పు పేరుతో రైతుల జీవితాలను ఛిద్రం చేస్తున్న రేవంత్‌రెడ్డి**
**ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




**మంథని, జూన్ 21 (సింగిడి) :** పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నపూర్ణగా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని ఆకలి రాష్ట్రంగా మారుస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అన్నమో రామచంద్రా ఏందీ మా బతుకులు అనే దుస్థితిలోకి తీసుకువచ్చారని ఆయన వాపోయారు. నేను దొంగను నా పెరుగులదలనే మోసాలు చీటింగ్ అని రేవంత్ రెడ్డి మనకు చెప్పి మోసం చేశాడని ఆయన అన్నారు. 50లక్షల నోట్ల సంచులతో దొరికిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అమెరికా వెళ్లిన రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల కరెంటు అక్కర లేదు మూడు గంటలు సరిపోతదని టెన్ హెచ్‌పీ మోటార్లు పెట్టుకుంటే పంటకు సరిపడా నీళ్లు అందుతాయని చెప్పాడని గుర్తు చేశారు. సీఎం అన్న మాట ప్రకారం మళ్లీ 24గంటల కరెంటు తీసివేయడానికి రైతు డిస్కంలు తీసుకువచ్చిండన్నారు. అలాగే పంటకు బీమా కడుతానని చెప్పి ఉన్న రైతుభీమను తీసివేశాడని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా 7600మంది రైతులు చనిపోతే ఆ కుటుంబాలకు రైతుబీమా రాకుండా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు అన్ని పంటలకు బోనస్ ఇస్తమని చెప్పి అసెంబ్లీలో 33రకాలు మాత్రమే సాగు చేసుకోవాలని మాట్లాడి బయటకు వచ్చినంక ఏడు రకాలే అంటున్నారని, ఆ ఏడు రకాలు దిగుబడి తక్కువగా వస్తయ్ కనుకనే సాగు చేసుకోమంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సైతం హద్దు అదుపు లేకుండా సిగ్గు లజ్జ లేకుండా మాట్లాడుతున్నారని, ఓ మంత్రి 33రకాలు అంటే మరో మంత్రి ఏడు రకాలంటూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి పదే పదే దేవుని మీద ఒట్లు వేస్తుండటంతో ఈ సర్కార్‌లో ప్రకృతి కూడా సహకరించడం లేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడిన వీడియోలు కనబడుతున్నాయని, ఆడియోలు వినబడుతున్నా కూడా ఇంకా అబద్దాలు ఆడుతూనే ఉన్నారని అన్నారు. ఇంత అబద్దాలు ఆడేవాళ్లు ప్రపంచంలో ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే దగా మోసమని, ఏనాడు ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచన చేయలేదని ఆయన అన్నారు. ఆనాడు వడ్లు కొనకపోతే ఎందుకు ఉన్నవ్ అని కేసీఆర్‌ను అన్నాడని, మరి ఈనాడు వడ్లు మక్కలు శనిగలు కూడా కొనడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా తీసుకువచ్చి ఎవరైనా మాట్లాడితే ఇళ్లు కూలగొడుతమంటూ బెదిరిస్తున్నారని అన్నారు. రైతుల నుంచి కొన్న పంటను విదేశాలకు ఎగుమతి చేస్తానని అన్న ముఖ్యమంత్రి మళ్లీ పంట మార్పిడి అంటూ రైతులను దగా చేస్తున్నాడని, రైతులకు వెసులుబాటు ఉన్న సన్నరకం వేసుకుంటే ఆ పంటను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మార్పు పేరుతో రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో 2028వరకు ప్రజలు ఆగే పరిస్థితిలోలేరని, రైతులే కాకుండా యావత్తు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. పంటల సాగులో రైతులు నిబంధనలు పాటించరని, రైతులు పండించే సన్నరకాలను కొనుగోలు చేయాల్సిందనని ఆయన డిమాండ్ చేశారు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించినట్లుగా 33రకాల సన్నాల ప్రభుత్వం ఖచ్చితంగా కొనుగోలు చేయాలని, లేకపోతే కల్లాల వద్దకు వస్తామని, ఎట్లా కొనుగోలు చేయరో చూస్తామన్నారు. రైతుబంధు పథకం డబ్బులు వేసేందుకు సభలు పెట్టి వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఆ డబ్బులతో రైతుబంధు వేయవచ్చని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళ్లు తెరువాలని, మీ సోషల్ మీడియాలో ఉన్న వీడియోలు చేసైనా మార్పు తెచ్చుకోవాలని సూచించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్**
**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంత ర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**





**సుల్తానాబాద్, జూన్21(సింగిడి):** ప్రతిరోజు యోగ చేయడం ద్వారా ఇలాంటి అనా రోగ్య సమస్యలు దరి చేరవని పెద్దపల్లి జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ ప్రజలకు, వాకర్స్ ,విద్యార్థులకుపిలుపునిచ్చారు. ఆదివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అ సోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జా తీయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు మురళీధర్, దేవ రకొండ ప్రకాష్, కోడెం అజయ్, యోగా ఆసనాలు వేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మ న్ మాట్లాడుతూ, ప్రతిరోజు 30 నిమిషాల పాటు యోగ సాధన చేయడం ద్వారా ఎటువంటి అనా రోగ్య సమస్యలు దరి చేరవని అన్నారు. దీంతో మానసిక ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన జీవనశైలి అమర్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌ న్సిలర్ కందునూరి సమత కుమార్, అమిరి శెట్టి శ్రావణి రాకేష్, సిద్ధ తిరుపతి,వేగోళం పద్మ అబ్బ య్య గౌడ్, గాదాసు మంజుల రవీంద ర్,వాకర్స్ ,అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు చొప్పరి సుమన్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్, కో శాధికారి కామణి శ్రీకాంత్, అమిరి శెట్టి రాజలింగం, చిలగాని లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, సాదుల సుగు ణాకర్ కొలిపాక రవీందర్,వెంకటేష్ఎలిగేటి రమే ష్, గుడ్ల వెంకటేష్, సుంక వేణు, బూడిద స్వామి మద్దెల కొమురయ్య ,సల్కం శ్రీనివాస్ శ్రీగిరి సుధా కర్, ఉల్లంగుల శ్రీనివాస్, దర్శనాల, రామచంద్రం, రామకృష్ణ, భైరగోని ప్రభాకర్, మల్లేశం, అడ్వకేట్ ఆవుల శివ, పోడేటి వెంకటేష్, లింగ మూర్తి, అమి రి శెట్టి తిరుపతి, గడ్డం శ్రీనివాస్, కలగూర విజయ్ కుమార్, రాఘవులు,కొయ్యడ సంతోష్, ఎల్లయ్య, అంతటి సంతోష్, సిరిపురం రమేష్, ఎల్లయ్యతో పాటు వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

# నాన్నకు ప్రేమతో..

**ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు**



**మంచిర్యాల, జూన్ 21(సింగిడి):** ఎవరు ఎంతమందిని హీరో లాగా ఆరాధించిన అందరి తొలి హీరో నాన్న. నాన్న అడుగుజాడల్లో బుడి బుడి అడుగులు వేస్తూ మొదలైన ప్రయాణం వడివడిగా సాగిపోయేప్పుడు నాన్న రోల్ మోడల్. తల్లిదండ్రుల ప్రేమలో తండ్రి స్థానం ఎంతో ప్రత్యేకమైనది. కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తి. పిల్లల భవిష్యత్తు కోసం తన కలను పక్కన పెట్టే వ్యక్తి తండ్రి. జిల్లాలో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా తమ తండ్రులకు ధన్యవాదాలు చెపుతూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఫాదర్స్ డే వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. నస్పూర్ లోని సృష్టి నవోదయ సైనిక్ పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ అంబాల రాజ్ కుమార్ విద్యార్థుల తండ్రులను ఆహ్వానించారు. కేక్ కట్ చేసి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబాల రజిత, వైస్ ప్రిన్సిపాల్ రమ, టీచర్స్ శిరీష పాల్గొన్నారు

# మంచిరామి లో దేవతలకు జలాభిషేకం

**సర్పంచ్ ఉప్పు లక్ష్మి తిరుపతి**



**సుల్తానాబాద్, జూన్ 21 (సింగిడి):** సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధి కారి ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ దేవత లకు నీళ్లతో అభిషేక కార్యక్రమాన్ని ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పం చ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్య లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# కుంటాల సర్పంచ్‌కు ప్రొసీడింగ్ కాపీని అందజేసిన ఎమ్మెల్యే పటేల్



**నిర్మల్ ప్రతినిధి, జూన్ 21 (సింగిడి ):** గత పది సంవత్సరాల కాలంలో కుంటాల మండల కేంద్రం అభివృద్ధి పరంగా వెనుక పడడంతో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఒకేసారి సిసి రోడ్లు, డ్రైనేజీలు, నిర్మాణానికి 66.50 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులను మంజూరు చేయించారు. సంబంధిత మంజూరు పత్రాన్ని భైంసా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కుంటాల సర్పంచ్ గజేందర్ కు అందజేశారు. పద్మశాలి సంఘం నుండి గ్రామపంచాయతీ వరకు రోడు నిర్మాణం కోసం 11 లక్షలు, జిపి నుండి హనుమాన్ టెంపుల్ కు9లక్షలు , గజ్జరం ఇంటి నుండి గజ్జలమ్మ టెంపుల్ వరకు 9.5 లక్షలు, సబ్బిడి రమేష్ ఇంటి నుండి గోవర్ధన్ ఇంటి వరకు 12 లక్షల రూపాయల నిధులు, శ్రీనివాస్ ఇంటి నుండి శ్రీకాంత్ ఇంటి వరకు 5.5 లక్షలు నిధులు, రవి ఇంటి నుండి గ్రామపంచాయతీ వరకు 9. 5 లక్షలు, తాటి సోమేశ్వర్ ఇంటి నుండి కటికే గంగాధర్ ఇంటి వరకు 2.5 లక్షలు, రూపాయలు,హన్మాండ్లు ఇంటి నుండి జుట్టు నవీన్ ఇంటి వరకు 3.5 లక్షల నిధులు, గంగారెడ్డి ఇంటి నుండి మేర లింగం ఇంటి వరకు 4 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిధులు రావడంతో సర్పంచ్ గజేందర్ గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, మా గ్రామానికి నిధులు పెద్ద మొత్తంలో రావడం సంతోషకరమన్నారు.

# జీఎం సార్...వ్యాయామం చేసేదెలా



**మంచిర్యాల, జూన్ 21 (సింగిడి):** సింగరేణి కార్మి కులు, వారి కుటుంబ సభ్యులు వ్యాయామం చేసేందుకు వీలుగా సింగరేణి యాజమాన్యం నస్పూర్ లోని ప్రాణహిత స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మహి ళలు, పురుషులు, చిన్నారులు వ్యాయామం చేస్తుంటారు. సింగరేణి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏళ్ల తరబడి ఉండాల్సిన పరికరాలు అతి తక్కువ కాలంలో పనికిరాకుండా పోయాయి. గత కొన్ని నెలల క్రితం పరికరాలు పనిచేయకుండా పోయాయి. వాటిని మరమ్మతులు చేయాల్సిన సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదు. సకాలంలో రిపేర్లు చేయించకపోవడంతో నిలలతరబడి వినియోగానికి పనికి రాకుండా వృధాగా పడి ఉన్నాయి. పలుమార్లు జీఎం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీఎం సార్ ఓపెన్ జిమ్ పై దృష్టి సారించి పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నారు.

# సింగరేణిలో ఒక్క బొగ్గుపెల్ల పక్కదారి పట్టే ఆస్కారం లేదు

**శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్**




**మంచిర్యాల, జూన్ 21(సింగిడి):** సింగరేణిలో అత్యంత పగడ్బందీగా బొగ్గు రవాణా జరుగుతుందని ఒక్క బొగ్గు పెల్ల పక్కదారి పట్టే ఆస్కారం లేదని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ కలిగి ఉందన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మైనింగ్ రంగంలో 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక సంస్థ అని దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మరియు పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో బొగ్గు చోరీలు జరిగాయని చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉండటమే కాకుండా, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేయబడుతోందన్నారు. బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు డిజిటల్ పర్యవేక్షణ, భద్రత తనిఖీలు, ఆన్లైన్ రికార్డులు వ్యవస్థలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. సింగరేణిలో ప్రతిరోజు సెక్యూరిటీతో గస్తీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి టన్ను బొగ్గు డిజిటల్ పర్యవేక్షణలో ప్రతి రవాణా భద్రతా నిఘాలో జరుగుతుందని ఎక్కడా పక్కదారి పట్టే అవకాశం లేదన్నారు.

# ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**మంచిర్యాల ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్**
**మానసిక శారీరక ఆరోగ్యానికి యోగ చాలా ఉపయోగకరం డా.సుకుమార్**



**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21 (సింగిడి) :** పన్నెండవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రం NHAI కార్యాలయ ఆవరణం లో యోగా దినోత్సవ వేడుకలు ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగ హాజరైన యోగ గురువు డా ,, సుకుమార్ NHAI సిబ్బందితో యోగ ప్రాముఖ్యతను ఆరోగ్య పరిరక్షణ లో దాని పాత్రను వివరిస్తూ అందరితో యోగాసనాలు చేయించారు .నిత్య జీవితం లో తీరిక లేకుండా పని చేయడం తో ఒత్తిడి పెరిగి వివిధ రకాల ఆరోగ్య రుగ్మతలకు లోనవుతూ చాలా మంది ఆరోగ్య సమస్యలతో భాద పడుతున్నారు. ఇంట్లోనే కూర్చొని మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడం లో యోగ చాలా ఉపయోగకరమని తెలిపారు .సరళమైన వ్యాయామాలు యోగాసనాలు, ప్రాణాయామం ధ్యానం వంటి యోగ సాధనాలను ప్రతి రోజు క్రమం తప్పకుండ అభ్యసిస్తే మంచి ఆరోగ్యం తో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని అన్నారు అజయ్ మని కుమార్ మాట్లాడుతూ: NHAI సిబ్బందికి అధికారులకు యోగ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు .ప్రతి రోజు యోగ చేయడం తో రోజంతా ఉత్సాహంగా ఒత్తిడి లేకుండా పని చేయవచ్చన్నారు .మానసిక శారీరక ఆరోగ్యం మెరుగు పడటమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండేలా దోహద పడుతుంది, కుటుంబ సభ్యులకు కూడా యోగ ప్రాముక్యతను వివరించి వారితో ప్రతి రోజు యోగ చేయించడం తో రోగాల భారిన పడకుండా ఆసుపత్రుల చుట్టూ తిరగకుండా కాపాడుతుంది. రోజు వారి కార్యకలాపాలలో అరగంట యోగ చేయడానికి కేటాయిస్తే ఆయిస్సు పెరుగుతుందని హితవు పలికారు. చీనా× కార్యాలయం ప్రతి నెల యోగ నిర్వహించాలని తెలుపడం తో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమం లో ప్రాజెక్ట్ మేనేజర్ సౌరభ్ రంజవ్ NHAI సిబ్బంది , ట్రైనీ యోగ డాక్టర్స్ ,సల్ల నరేష్ అడ్వకేట్ ,అనిల్ ఎ౩౩ మేనేజర్ పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగతో నిత్య యవ్వనం సాధ్యం!

**అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఘనంగా యోగాభ్యాస కార్యక్రమం**



**గోదావరిఖని జూన్ 21 (సింగిడి):** ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ' థీమ్‌తో అవగాహన, అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ప్రత్యేక యోగాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ ఎ. సాంబశివరావు మాట్లాడుతూ, ఈ ఏడాది యోగ దినోత్సవం "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వయస్సు పెరిగినా చురుకుదనాన్ని కొనసాగించేందుకు, ఒత్తిడి మరియు జీవనశైలి సంబంధిత వ్యాధులను దూరం చేసుకోవడానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని వివరించారు. ప్రతి ఒక్కరూ యోగను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులు, అధ్యాపకులకు పిలుపునిచ్చారు.

**యోగాసనాలతో ఆరోగ్యంపై అవగాహన**

అనంతరం కామర్స్ అధ్యాపకుడు శ్రీ వి. ఆంజనేయులు, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ విద్యార్థిని భార్గవి సంయుక్తంగా అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లకు దైనందిన జీవితంలో ఉపయోగపడే పలు యోగాసనాలను ప్రదర్శించి సాధన చేయించారు. యోగాసనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి అవగాహన కల్పించారు.

**అధ్యాపకులు, విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డా. జి. సుబ్బారావు, డా. సవిత, డా. శారద, డా. ఎం. నరేష్, డా. అజయ్ కుమార్, డా. డి. కిరణ్మయి, డా. పి. శ్రీదేవి, డా. వి. కిరణ్ కుమార్, డా. వి. నరేష్, డా. పి. ఉషారాణి, శ్రీలత, జలజా, అరుణమ్మ, భాగ్యలక్ష్మి, శంకరయ్య తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు భార్గవి, పాల్సన్ రాజ్, సంతోష్, అభిషేక్ తదితర విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యోగ సాధన- ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా

**12వ అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు కార్యాలయాల్లో యోగా నిర్వహణ.**
**ఎస్పీ క్యాంప్ కార్యాలయం నందు సిబ్బందితో కలిసి యోగా నిర్వహించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్ ప్రతినిధి, జూన్ 21 (సింగిడి):** ప్రపంచ 12వ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు ఎస్పీ క్యాంప్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారు పాల్గొని సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. మొదటగా యోగా శిక్షకుడు హెడ్ కానిస్టేబుల్ బాలాజీ యోగ ను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, ఆసనములు సిబ్బంది ద్వారా చేయించడం జరిగింది. యోగా దినోత్సవం లో భాగంగా జిల్లా ఎస్పీ తో సహా సిబ్బంది అందరూ వివిధ రకాల సూర్య నమస్కారాలు, ఆసనములు, వివిధ రకాల ప్రాణాయాములు స్వయంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశిస్తూ జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆధునిక సమాజపు పోకడలకు లొంగిపోయి, అనారోగ్యంతో కునారిల్లుతున్న మనిషికి యోగా ప్రకృతిసిద్ధమైన శక్తిని అందిస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈరోజు యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అతి చిన్న వయసులోనే రోగాలకు గురవుతూ ప్రమాద పరిస్థితులు నెలకొంటున్న నేటి పరిస్థితుల్లో యోగా, సూర్య నమస్కారాలు, నడక వంటివి మన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగ అనేది వయసుకు సంబంధం లేకుండా అందరూ చేసే ఒక సాధనమని పేర్కొంటూ, యోగా వల్ల, ఆసనాల వల్ల అనారోగ్య బారిన పడకుండా, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులు రేయింబవళ్లు 24 గంటలు విధులను నిర్వర్తిస్తుంటారని వారికి యోగ ఎంతగానో తోడ్పాటు అందజేస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుతూ విధులను నిర్వర్తించాలని సూచించారు. యోగ ప్రాణాయామము ఆసనాలు వలన మానసిక, శరీరక విశ్రాంతి, ఉపశమనం లభించి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. గుండెకు, శరీరానికి, మనసుకు అన్నిటికీ యోగ ఉత్తమమైన మార్గమని తెలిపారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు కార్యాలయాల్లో సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల గారితో పాటు ఆర్ ఐ లు రామ్ నిరంజన్ రావ్, శేఖర్,రామక్రిష్ణ, ఆర్ఎస్ఐ లు మరియు మిగతా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**మంచిర్యాల, జూన్ 21 (సింగిడి):** రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్సెట్టిపేట మండలం దౌడేపల్లి (చందారం) లో చందారం గ్రామ రైతు పొదుపు, పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని రైతుల కొరకు విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందు కొరకు అవసరమైన మెటీరియల్, ఎక్విప్మెంట్ సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా 12వేల క్వింటాళ్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన లారీలను సమకూర్చడం జరిగిందని, సింగరేణి సంస్థ, ఇసుక తరలింపు సంబంధిత లారీలను ధాన్యం కొరకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. వర్షాలు రాకముందే ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలో చెల్లింపులు చేయడం జరిగిందని, దాదాపు 98 శాతం ధాన్యం కొనుగోలు సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు తో పాటు దాదాపు 22 వేల టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 452 కోట్ల చెల్లింపులు కాగా మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 270 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. ఈసారి ఐ.కె.పి. వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం కొనుగోలు కేంద్రాలు ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. కడెం కాలువ 42వ డిస్ట్రిబ్యూటరీ నుండి నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లారీలు, హమాలీల సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, గతంలో ఎకరాకు 20 నుండి 22 క్వింటాళ్లు ధాన్యం దిగుబడి రాగా ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములకు తరలించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలతో రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రైతు సంక్షేమంలో రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని తెలిపారు.

# యోగా ఆసనాలతో ఆకట్టుకున్న కందుల సంధ్యారాణి

**గోదావరిఖనిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**
**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అవసరం**
**భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి**



**గోదావరిఖని జూన్ 21 (సింగిడి):** వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యమే మహాభాగ్యమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ గోదావరిఖని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధనలో భాగమయ్యారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె ప్రదర్శించిన వివిధ యోగా ఆసనాలు సభలోని ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, "యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది మనిషి శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే గొప్ప భారతీయ సంస్కృతి సంపద" అని తెలిపారు. నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో యోగా ఆరోగ్యకరమైన జీవనానికి మార్గదర్శకమని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ యోగా వైభవం మరింత విస్తరిస్తుండటం ప్రతి భారతీయుడు గర్వించాల్సిన విషయమని ఆమె అన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు నరోత్తం రెడ్డి మాట్లాడుతూ....లి యోగా సాధన ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని గుర్తు చేస్తాయన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించడం ద్వారా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి అనేక జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని వివరించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందించడంలో, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వారు తెలిపారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు యోగా పట్ల ప్రజల్లో మరింత చైతన్యం కలిగించాయి. ఈ కార్యక్రమంలో యోగా గురువు రజనీ గారు బిజెపి సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ బిజెపి మండల అధ్యక్షులు ఉరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య మరియు నాయకులు ఎల్తూరి సరిత, జక్కుల పద్మ ,కోట తిరుమల,జక్కన రాజ్యలక్ష్మి ,కోడూరి రమేష్,జక్కన్న బాలు,జక్కుల ప్రవీణ్ ,లక్ష్మీ నరసయ్య,గంగరాజు,ఎల్తూరి రాజయ్య, పాకాల నరసింహారెడ్డి,సిలారపు కళ్యాణ్, వకుళాభరణం వేణు, జనగామ శివరాం యోగా సాధకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# క్రమం తప్పకుండా యోగా చేస్తే
# శుక్రకణాల నాణ్యత పెరుగుతుందట


ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15 శాతానికి పైగా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో సగం కేసులలో పురుషులలోని లోపాలే కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, లైఫ్‌స్టైల్ మార్పులు (ముఖ్యంగా యోగా) పురుషుల పునరుత్పత్తి ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తాయనేదానికి ఈ అధ్యయనం ఒక బలమైన నిదర్శనంగా నిలిచింది. దేశవ్యాప్తంగా చాలా మంది పురుషులు తక్కువ స్పెర్మ్ కౌంట్‌తో బాధపడుతున్నారు. అంతేకాకుండా వారి శుక్రకణాల నాణ్యత కూడా తగ్గిపోతుంది. ఇది వారి సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపుతోంది.



ఇలాంటి పరిస్థితుల్లో దంపతులు పిల్లలను కనే ఆనందానికి దూరమవుతున్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌పరిశోధకులు జరిపిన ఒక తాజా అధ్యయనం ప్రకారం.. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల పురుషులలో శుక్రకణాల నాణ్యత పెరుగుతుందని, అలాగే వంధ్యత్వానికి (ఇన్‌ఫెర్టిలిటీ) కారణమయ్యే ఆక్సిడేటివ్ స్ట్రెస్, డీఎన్ఏ (ఐచీూ) దెబ్బతినడం వంటి సమస్యలు తగ్గుతాయని తేలింది. జూన్ 21న రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందే ఈ పరిశోధన వివరాలు 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ యోగా'లో ప్రచురితమయ్యాయి.

**పరిశోధన ఎలా సాగింది?**
మీా అనాటమీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రీమా దాదా, డాక్టర్ ప్రభాకర్ తివారీ, డాక్టర్ రాజీవ్ కుమార్, అంజలి యాదవ్‌ల బృందం ఈ పరిశోధనను చేపట్టింది. పాల్గొన్నవారు: 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న 78 మంది పురుషులపై ఈ అధ్యయనం ప్రారంభించగా, వారిలో 42 మంది 12 వారాల పాటు ఈ యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. యోగా షెడ్యూల్: రోజుకు ఒక గంట చొప్పున, వారానికి ఐదు రోజులు.. ఆసనాలు, ప్రాణాయామం (శ్వాస వ్యాయామాలు), ధ్యానం (మెడిటేషన్), రిలాక్సేషన్ పద్ధతులను వీరు పాటించారు.

**అసలు సంతానలేమికి కారణాలు ఏంటి?**
డాక్టర్ రీమా దాదా గారి వివరణ ప్రకారం ఆధునిక కాలంలో మగవారిలో కారణం తెలియని వంధ్యత్వం పెరిగిపోవడానికి కొన్ని అంశాలు కారణమవుతాయి. అనారోగ్యకరమైన జీవనశైలి, ఊబకాయం. ధూమపానం, మద్యపానం. మితిమీరిన మానసిక ఒత్తిడి, కాలుష్యం. ఆహారం, నీటి ద్వారా శరీరంలోకి చేరే 'మైక్రో-నానో



ప్లాస్టిక్స్'. ఆలస్యంగా వివాహం చేసుకోవడం, ఆలస్యంగా పిల్లల్ని కనాలని అనుకోవడం. దుష్ప్రభావం: ఈ కారణాల వల్ల కణాల్లోని మైటోకాండ్రియా దెబ్బతింటుంది. ఇది 'ఆక్సిడేటివ్ స్ట్రెస్'కు దారితీసి.. శుక్రకణాల ఐచీూను దెబ్బతీస్తుంది. టెలోమియర్‌లను తగ్గిస్తుంది. దీనివల్ల సంతానలేమి మాత్రమే కాకుండా, పదే పదే గర్భస్రావాలు జరగడం, పుట్టబోయే పిల్లల్లో జన్యుపరమైన లోపాలు, క్యాన్సర్లు, మానసిక రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉంది.


**అధ్యయనంలో తేలిన ఫలితాలు**
12 వారాల యోగా శిక్షణ తర్వాత పురుషుల్లో అద్భుతమైన మార్పులు కనిపించాయి. శుక్రకణాల పనితీరు మెరుగైంది. స్పెర్మ్ కౌంట్, కదలిక పెరిగాయి. ఆక్సీకరణ ఒత్తిడి, డీఎన్ఏ (ఐచీూ) దెబ్బతినే రేటు గణనీయంగా తగ్గింది. అయితే, ఐచీూ నాణ్యతలో పూర్తి స్థాయి మార్పు రావడానికి కనీసం ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా యోగా చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

**యోగా శరీరంపై ఎలా పని చేస్తుంది?**
సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి యోగా అంతర్గతంగా ఎలా సాయపడుతుందో పరిశోధకులు వివరించారు.
**స్ట్రెస్ హార్మోన్ల తగ్గింపు:** యోగా వల్ల శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ వంటి హార్మోన్లు తగ్గి, మానసిక ప్రశాంతత లభిస్తుంది.
**రక్తప్రసరణ మెరుగుపడటం:** ప్రత్యేక ఆసనాల వల్ల పునరుత్పత్తి అవయవాలకు రక్తప్రసరణ బాగా పెరుగుతుంది.
యాంటీఆక్సిడెంట్ రక్షణ: శరీరం స్వయంగా హానికరమైన ఫ్రీ-రాడికల్స్‌తో పోరాడే శక్తిని పెంచుకుంటుంది.
**కణాల ఆరోగ్యం:** మైటోకాండ్రియా సమర్థతను పెంచి కణాల వయసును తగ్గించే టెలోమిరేస్ ఎంజైమ్ స్థాయిల్ని మెరుగుపరుస్తుంది.

**చివరగా ఏం తెలుసుకోవాలి?**
వంధ్యత్వానికి కేవలం ఖరీదైన మందులు, ల్యాబ్ ట్రీట్‌మెంట్‌లు మాత్రమే కాకుండా.. ఖర్చు లేని, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని 'యోగా'ను ఒక అదనపు చికిత్సగా వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. ఇది దంపతుల్లో సంతాన లేమి భారాన్ని తగ్గించడమే కాకుండా, ఆరోగ్యకరమైన తర్వాతి తరానికి పునాది వేస్తుంది.

### తేనె ం అల్లం తులసి దగ్గును తగ్గించడంలో
## ఎంత వరకు ఉపయోగపడతాయి, ఇందులో వాస్తవమెంత?

ప్రస్తుతం మారుతున్న వాతావరణం, కాలుష్యం కారణంగా చాలా మందిని వేధించే ప్రధాన సమస్య దగ్గు. మార్కెట్‌లో దొరికే కెమికల్ దగ్గు సిరప్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయనే భయంతో చాలా మంది ఈజీగా అందుబాటులో ఉండే సహజ నివారణల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఇవి



సాధారణ దగ్గు, జలుబు ప్రారంభ దశలో

ఉన్నప్పుడు మాత్రమే చక్కటి ఉపశమనాన్ని ఇవ్వగలవు. అంతేకానీ అవి తీవ్రరూపం దాల్చినప్పుడు ఇవి డాక్టర్లు సూచించే మందులకు ప్రత్యామ్నాయం కావు. దగ్గు తగ్గడానికి మెడిసిన్స్ కంటే ఇంటి చిట్కాలనే చాలా మంది ఇష్టపడతారు. ఎందుకంటే ఇవి మనకు చాలా సులభంగా అందుబాటులో ఉంటాయి. అంతే కాకుండా దగ్గు సిరప్‌లను ఎక్కువగా వాడటం వల్ల దుష్ప్రభావాలు కలగడమే కాకుండా కొన్ని సార్లు అలర్జీల వల్ల దగ్గు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. అందుకే చాలా మంది తేనె, అల్లం, తులసి వంటి సులభంగా అందుబాటు లో ఉండే సహజ నివారణాలను ఇష్టపడతారు. అయితే వీటిని సరైన పద్ధతిలో ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే వీటిని అతిగా తీసుకోకుండా జాగ్రత్తపడటం కూడా చాలా ముఖ్యం.


### కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో
## లో-బ్లడ్ షుగర్, శరీరంలో కనిపించే లక్షణాలు

మూత్రపిండాల వ్యాధి ఉన్న రోగుల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం, లేదా హైపోగ్లైసీమియా ఎక్కువగా సంభవించవచ్చు. ఇఖణ రోగుల్లో ఆకలి లేకపోవడం, వికారం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటివి సాధారణం. ఇవి రక్తంలో చక్కెర స్థాయిల్ని తగ్గిస్తాయి. అంతేకాకుండా, రోగుల ఇన్సులిన్ అవసరాలు మారినప్పటికీ వారు తరచుగా మధుమేహం మందుల్ని అదే మోతాదులో తీసుకోవడం కొనసాగిస్తారు. దీనివల్ల హైపోగ్లైసీమియా ప్రమాదం పెరుగుతుంది. మూత్రపిండాల వ్యాధి ఉన్న మధుమేహ రోగులకు రక్తంలో చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ ఎక్కువగా ఉంటాయని సాధారణంగా నమ్ముతారు.

కానీ ఇందుకు విరుద్ధంగా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ఉన్నవారిలో, ముఖ్యంగా దయాబెటిస్ కూడా ఉన్న రోగులలో రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడం జరుగుతుంది. ఈ పరిస్థితిని హైపోగ్లైసీమియా అంటారు. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి కిడ్నీల పనితీరును ప్రభావితం చేయడమే కాకుండా.. శరీరంలోని రక్తంలో చక్కెర సమతుల్యతను కూడా దెబ్బతీస్తుంది. ఇక కిడ్నీ వ్యాధికి, లో షుగర్ లెవల్స్ మధ్య ఉన్న లింకేంటి, ఏ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకూడదు, పాటించాల్సిన చిట్కాలు గురించి పూర్తి వివరాల్ని డాక్టర్ కిషన్ ఎ (కన్సల్టెంట్ -- నెఫ్రాలజీ, ఆస్టర్ సిఎమ్ఐ హాస్పిటల్, బెంగళూరు) అందించారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

**ఈ రెండింటికి లింక్ ఏంటి?**
మన శరీరంలో ఇన్సులిన్‌ను బయటకు పంపడంలో, గ్లూకోజ్ స్థాయిల్ని సమతుల్యంగా ఉంచడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. కిడ్నీల పనితీరు క్షీణించినప్పుడు, ఇన్సులిన్ శరీరం నుంచి త్వరగా బయటకు పోకుండా ఎక్కువ సేపు రక్తంలోనే ఉండిపోతుంది. దీనివల్ల బ్లడ్ షుగర్ స్థాయిలు అనుకున్నదానికంటే చాలా ఎక్కువగా పడిపోతాయి. కిడ్నీ వ్యాధి ముదురుతున్న కొద్దీ లో-బ్లడ్ షుగర్ (హైపోగ్లైసీమియా) సమస్యలు మరింత తరచుగా ఎదురవుతాయి. అందుకే కిడ్నీ వ్యాధికి, లో-బ్లడ్ షుగర్‌కు చాలా బలమైన లింక్ ఉంది. దీంతో పాటు ఆకలి తగ్గడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల ప్రభావం, శరీరం సొంతంగా గ్లూకోజ్ తయారుచేసే సామర్థ్యం తగ్గడం వల్ల కిడ్నీ రోగుల్లో లో-బ్లడ్ షుగర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**గమనించాల్సిన లక్షణాలు**
రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయినప్పుడు కనిపించే లక్షణాలు:
విపరీతంగా చెమటలు పట్టడం
చేతులు, కాళ్ళు వణకడం
కళ్లు తిరగడం, అలసట
తీవ్రమైన ఆకలి వేయడం
తలనొప్పి, చిరాకు, కోపం రావడం
కంటిచూపు మసకబారడం
గందరగోళంగా అనిపించడం, ఒక విషయంపై దృష్టి పెట్టలేకపోవడం
**తీవ్రమైన కేసుల్లో:** రోగి స్పృహ తప్పిపోవచ్చు రావచ్చు లేదా కోమాలోకి వెళ్ళే ప్రమాదం ఉంది. అందుకే ఈ లక్షణాల్ని ముందుగానే గుర్తించి





చికిత్స అందించడం చాలా ముఖ్యం.

**లో-బ్లడ్ షుగర్ అనేది కిడ్నీల పనితీరు మెరుగుపడటానికి సంకేతమా?**
కొంతమంది రోగులు రక్తంలో షుగర్ లెవల్స్ తక్కువ ఉండటాన్ని ఆరోగ్యం మెరుగుపడటంగా పొరబడతారని నిపుణులు వివరిస్తున్నారు. కానీ వాస్తవానికి, మూత్రపిండాల పనితీరు క్షీణించడం వల్ల శరీరంలో ఇన్సులిన్, మందులు విచ్ఛిన్నమయ్యే విధానంలో మార్పులకు ఇది ఒక సంకేతం కావచ్చు. అందువల్ల, రక్తంలో చక్కెర అకస్మాత్తుగా తగ్గడాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.


**పాటించాల్సిన చిట్కాలు**
నిరంతరం బ్లడ్ షుగర్ స్థాయిల్ని పరీక్షించుకుంటూ ఉండాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం దయాబెటిస్ మందుల్ని సరైన సమయానికి వేసుకోవాలి. సమతుల్య ఆహారాన్ని నిర్ణీత వేళల్లో తీసుకోవాలి (భోజనం స్కిప్ చేయకూడదు).
కిడ్నీ పనితీరును క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ, డాక్టర్ సలహాతో మందుల డోసేజ్‌ను సర్దుబాటు చేసుకోవాలి. తరచుగా షుగర్ లెవల్స్ పడిపోతుంటే వెంటనే డాక్టర్‌కు చెప్పాలి. ఎందుకంటే ఇన్సులిన్ లేదా షుగర్ మందుల డోస్ తగ్గించాల్సి రావచ్చు.
కిడ్నీకి మేలు చేసే డైట్ పాటించడం, తగినంత నీరు తాగడం, బీపీ, షుగర్‌ల్ని అదుపులో ఉంచుకోవడం వల్ల మరిన్ని ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

**ముఖ్యమైన విషయాలు**
గ్లూకో నియోజెనిసిస్ లోపం: మన కిడ్నీలు కేవలం వ్యర్థాల్ని వడపోయడమే కాకుండా, శరీరానికి అవసరమైనప్పుడు సొంతంగా గ్లూకోజ్‌ను కూడా తయారు చేస్తాయి (దీనినే గ్లూకో నియోజెనిసిస్ అంటారు). కిడ్నీలు పాడైనప్పుడు ఈ ప్రక్రియ మందగించి, బ్లడ్ షుగర్ సులభంగా పడిపోతుంది.
**మందుల మార్పు:** కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు సాధారణంగా వాడే కొన్ని దయాబెటిస్ మందులు శరీరంలో ఎక్కువసేపు ఉండిపోతాయి. అందుకే డాక్టర్లు కిడ్నీ రోగులకు సురక్షితమైన ప్రత్యామ్నాయ మందుల్ని సూచిస్తారు. దీనిపై ఎల్లప్పుడూ నెఫ్రాలజిస్ట్ సలహా తీసుకోవడం ఉత్తమం.




### భారీగా తగ్గి మళ్లీ షాకిచ్చిన
# బంగారం ధరలు..

ఇవాళ మార్పు.. తులం గోల్డ్ రేటు హైదరాబాద్‌లో ఎంత?



*ఇటీవల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను మరోసారి స్థిరంగానే ఉంచిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించని నేపథ్యంలో బంగారం ధరలు వరుసగా దిగొచ్చాయి. అయితే వరుసగా తగ్గిన తర్వాత ఇప్పుడు జూన్ 20న స్వల్పంగా పెరిగాయి. బంగారం ధర పెరిగినా వెండి ధర మారలేదు. ప్రస్తుతం గోల్డ్, సిల్వర్ రేట్లు ఎక్కడ ఎలా ఉన్నాయో మనం తెలుసు కుందాం.*

**బంగారం ధరలు**
పసిడి ప్రియులకు అలర్ట్. బంగారం, వెండి ధరలు గత 4 రోజులు భారీగా దిగొచ్చినా ఇప్పుడు మాత్రం మళ్లీ గోల్డ్ రేట్లు స్వల్పంగా పెరిగాయి. మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగానే ఉంది. ఇప్పుడు దేశీయంగా, అలాగే అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయనేది చూద్దాం. దేశీయంగా చూస్తే హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పసిడి ధర రూ. 200 పెరిగి తులం రూ. 1,33,900 వద్ద కొనసాగు తోంది. దీనికి ముందు వరుసగా 4 రోజులు రేటు తగ్గడం విశేషం. వరుసగా రూ. 3350, రూ. 1450, రూ. 250, రూ. 150 మేర తగ్గుతూ వచ్చింది. ఇలా వరుసగా 4 రోజుల వ్యవధిలో గోల్డ్ రేటు రూ. 5200 తగ్గుముఖం పట్టింది.

ఇదిలా ఉండగా ఇదే సమయంలో 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర హైదరాబాద్ మార్కెట్లో రూ. 220 పెరిగింది. దీంతో ప్రస్తుతం 10 గ్రాములకు రూ. 1,46,080 వద్ద ట్రేడవుతోంది. ఇది అంతకుముందు వరుసగా 4 రోజుల్లో రూ. 3650, రూ. 1590, రూ. 270, రూ. 160 చొప్పున తగ్గింది. ఇక బంగారం ధర స్వల్పంగా పెరిగినా మరోవైపు వెండి రేటు స్థిరంగానే ఉంది. హైదరాబాద్ నగరంలో కేజీ సిల్వర్ రేటు రూ. 2.55 లక్షల వద్ద ఉంది. దీనికి ముందు చూస్తే సిల్వర్ రేటు వరుసగా రూ. 15 వేలు, రూ. 5 వేలు, రూ. 5 వేలు చొప్పున తగ్గింది. ఇలా వరుసగా 4 రోజుల్లో రూ. 25 వేల మేర తగ్గడం విశేషం.
దేశీయంగా ఇలా ఉన్నప్పటికీ ఇంటర్నేషనల్ మార్కెట్లో పసిడి, వెండి ధరలు ఫ్లాట్‌గానే ఉన్నాయి. స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 4159 డాలర్ల వద్ద ఉంది. కిందటి రోజు ఒక దశలో ఇంట్రాడేలో 4130 డాలర్ల స్థాయికి కూడా పడిపోయింది. సిల్వర్ రేటు చూస్తే 65 డాలర్ల దిగువకు పడిపోయింది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ పుంజుకుంది. ప్రస్తుతం రూపాయి విలువ రూ. 94.36 వద్ద ఉంది.
కొద్ది రోజుల కిందట పశ్చిమాసియాలో అమెరికా- ఇరాన్ డీల్ నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా తగ్గగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. తర్వాత యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను తగ్గించలేదు. ఇంకా భవిష్యత్తులో పెంచే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది. దీంతో బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఇక వరుసగా తగ్గగా ఇవాళ స్వల్పంగా పెరిగాయి.

# ఇన్వెస్టర్లకు పండగే.. ఈవారం 3 కంపెనీల ఐపీఓలు..

**స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు పండగే. ఎందుకంటే ఈ వారం 3 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. లిస్టులో వాటర్ వేస్ లీజర్ టూరిజం కంపెనీ, జువెలరీ సంస్థ, సీఎస్ఎం టెక్ కంపెనీలు ఉన్నాయి. మరి ఈ కంపెనీల ఐపీఓల సబ్‌స్క్రిప్షన్ ఎప్పుడు మొదలవుతుంది? ఒక్కో షేరు ధర ఎంత ఉంటుంది? అనే వివరాలు తెలుసుకుందాం.**




**స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు పండగే**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో పబ్లిక్ ఇష్యూల సందడి మొదలైంది. మెయిన్ బోర్డు కేటగిరీ నుంచి ఈ వారం 3 కంపెనీలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ ( ఐపీఓ)లకు వస్తున్నాయి. ఈ ఐపీఓల ద్వారా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. వాటర్ వేస్ లీజర్ టూరిజం (కార్డెలియా క్రూయిజెస్), జైపూర్ కు చెందిన జువెలరీ కంపెనీ అద్వైత్ జువెల్స్, ఐటీ సొల్యూషన్స్ కంపెనీ సీఎస్ఎం టెక్నాలజీస్ కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ప్యాకింగ్ సొల్యూషన్స్ అందించే న్యాక్ ప్యాకేజింగ్ వచ్చే వారమే ప్రైస్ బ్యాండ్ నిర్ణయించనున్నాయి.

**వాటర్ వేస్ లీజర్ టూరిజం**
వాటర్ వేస్ లీజర్ టూరిజం కంపెనీ పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.585 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.769 నుంచి రూ.808గా నిర్ణయించారు. జూన్ 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉండనుంది. పూర్తిగా షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా జారీ చేయనున్నారు.

**అద్వైత్ జువెల్స్**
ఈ కంపెనీ ఐపీఓ ద్వారా రూ.165.16 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూన్ 23వ తేదీన సబ్‌స్క్రిప్షన్ మొదలవుతోంది. జూన్ 25వ తేదీన ముగియనుంది. ధరల శ్రేణిని రూ.130 నుంచి రూ.138గా కంపెనీ నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా 1.20 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ చేరీ చేస్తోంది. అప్పులు తీర్చేందుకు, నిర్వహణ ఖర్చులకు ఈ డబ్బులు వినియోగించనుంది.

**ఐటీ కంపెనీ ఐపీఓ**
ఐటీ సేవల సంస్థ సీఎస్ఎం టెక్నాలజీస్ రూ.146 కోట్లను ప్రాథమిక మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.107 నుంచి రూ.113గా నిర్ణయించారు. జూన్ 24వ తేదీ న ఈ సబ్‌స్క్రిప్షన్ మొదలై జూన్ 27 వ తేదీ వరకు కొనసాగనుంది. ఇది కూడా పూర్తి ఫ్రెష్ షేర్లను జారీ చేయనుంది.

**పెద్ద ఐపీఓలు**
క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో ఐపీఓ ద్వారా రూ.10 వేల కోట్లు సమీకరించనుంది. అలాగే ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ రూ.13 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, రిలయన్స్ జియో సంస్థలు ముసాయిదా పత్రాలను సమర్పించాయి. దీంతో ఈ ఏడాది తొలి అర్ధభాగం స్తబ్దుగా ఉన్న ఐపీఓ మార్కెట్ రెండో అర్ధభాగంలో వేగం పుంజుకోనుంది.

# కిసాన్ క్రెడిట్ కార్డ్ రూల్స్ మార్పు

కిసాన్ క్రెడిట్ కార్డ్ రూల్స్ మార్పు..

**కొత్త మార్గదర్శకాలు జారీ.. ఏం మారాయంటే?**
రైతులకు బిగ్ అలర్ట్. కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డులకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు వచ్చాయి. ఈ కార్డుల ద్వారా రుణాలు అందించే అంశంలో కొత్త మార్గదర్శకాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసింది. ఒకే చెల్లింపుల పరిమితి, పంట కాలాల నిర్వచనాన్ని




ప్రామాణీకరించింది. మరి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం.

**రుణాల చెల్లింపుపై కాల పరిమితి**
దేశంలోని రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా సకాలంలో, ఈజీగా రుణాలు అందించడమే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. లోన్ల మంజూరు, రుణాల తిరిగి చెల్లింపుల కాల పరిమితిలో దేశవ్యాప్తంగా ఒకే విధమైన పారదర్శకత తీసుకురావడానికి పంట కాలాల నిర్వచనాన్ని ఆర్‌బీఐ ప్రామాణీకరించింది. కొత్త రూల్స్ 2027, జనవరి 1వ తేదీ నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. మరి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.
బ్యాంకుల ఆదాయ గుర్తింపు, ఆస్తుల వర్గీకరణ రూల్స్‌కి అనుగుణంగా పంట కాలాన్ని రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించింది. స్వల్పకాలిక పంటల కాలాన్ని గరిష్ఠంగా 12 నెలలుగా, దీర్ఘకాలిక పంట కాలాన్ని గరిష్ఠంగా 18 నెలలుగా ఖరారు చేసింది. వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలకు ఒక వ్యక్తి తీసుకునే రూ.2 లక్షల లోపు లోన్లకు బ్యాంకులు ఎటువంటి మార్జిన్ మనీ, అదనపు ష్యూరిటీ అడగకూడదు. హామీ లేని లోన్ల పరిమితిలోపు, రైతులు స్వచ్ఛందంగా బంగారం లేదా వెండిని తాకట్టు పెట్టి లోన్ తీసుకుంటే దానిని కొలెటర్ ఫ్రీ రూల్స్ ఉల్లంఘనగా పరిగణించరు. దేశంలోని రైతులకు పెట్టుబడి కష్టాలు తీర్చడం కోసం కేంద్ర ప్రభుత్వం 1998లో ప్రవేశపెట్టిన అద్భుతమైన పథకమే ఈ కిసాన్ క్రెడిట్ కార్డు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేందుకు, సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లి మోసపోకుండా, బ్యాంకుల ద్వారా చాల తక్కువ వడ్డీకే రుణాలు అందించడం ఈ కార్డు ఉద్దేశం. సాధారణంగా బ్యాంకులు ఇచ్చే రుణాలతో పోలిస్తే కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఇచ్చే రుణాలపై వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది. కేసీసీ కింద లభించే రుణాలపై బేసిక్ వడ్డీ రేటు 7 శాతంగా ఉంటుంది. ఒక వేళ రైతు తీసుకున్న లోన్ రూ.3 లక్షల వరకు ఏడాదిలోపు కరెక్ట్ గా తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం అదనంగా 3 శాతం వడ్డీ సబ్సిడీ ఇస్తుంది. అంటే క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే రైతులకు కేవలం 4 శాతం వడ్డీకే ఈ రణం లభిస్తుంది. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి ష్యూరిటీ అవసరం లేదు. కొన్ని బ్యాంకుల్లో దీనిని రూ.3 లక్షల వరకు కూడా పొడిగించారు. ఈ కార్డు కాల పరిమితి 5 సంవత్సరాల వరకు ఉంటుంది, రైతు క్రెడిట్ హిస్టరీ బాగుంటే ప్రతి ఏటా లోన్ లిమిట్ 10 శాతం వరకు పెంచుకుంటూ వెళ్తారు.



## కల్లు మండవలో పహాని బుక్కు

### చిత్తుచిత్తయిన పహాని పేపర్లు



**మల్యాల, ( సింగిడి):**
కార్యాలయంలో భద్రంగా ఉండా ల్సిన పహాని బుక్ కల్లు మండవలో లభ్యమయింది. ఒకానొక సందర్భం లో ఒక రైతుకు తన అవసరానికి ఫలానా సంవత్సరం పహాని అవస రం ఉందని ఆఫీసుల చుట్టూ తిరిగి తే చెప్పులు అరిగిన దొరకని పహాని బుక్కు నేడు కల్లు మండవలోని హోటల్ తినుబండారాలకు ఆసరైం ది. వివరాల్లోకి వెళితే సోమవారం రాత్రి కొందరు మల్యాల కల్లు మం డువలో మద్యం సేవించి వెళ్లిపోగా మరుసటి రోజు గ్రామపంచాయతీ సిబ్బంది ఒకరు అక్కడ ఉన్న పహాని బుక్కు చూసి ఇది ఏదో పనికిరానిది అనుకోని అక్కడే ఉన్న హోటల్ యజమానికి ఇవ్వగా అతను దానిని చింపి తినుబండారాలకు ప్యాక్ చేసి ఇవ్వడం విషయం బయటకు వచ్చింది. మల్యాల గ్రామానికి చెందిన పహానిగా గుర్తించి ఇది కాస్త వైరల్ అయింది విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు హోటల్ యజమాని దగ్గరికి వచ్చి పహాని బుక్ స్వాధీనం చేసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీనిపై తాసిల్దార్ శ్రీనివాస్ ను వివరణ కోరగా పహాని బుక్కులో ఉన్న సంవత్సరం 1985 సంబంధించిన రికార్డులు మా దగ్గర ఏమీ లేవని ఇది ఇప్పుడు పోయిందో మా ఆధీనంలో లేదని దీనిపై పూర్తి విచారణ జరిపిస్తామని తెలిపారు.

## పారదర్శకంగా ఇసుక వేలం పాట

### 6 లక్షల నాలుగు వేలకు టెండర్ దక్కించుకున్న చక్రపాణి



**జమ్మికుంట, (సింగిడి) :**
జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో సోమవారం కరీంనగర్ ట్రాన్స్పోర్ట్ పోలీసులు జమ్మికుంట పోలీసులతో కలిసి అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపు లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 120 ట్రాక్టర్ల ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ అధికారులు మంగళవారం విలాసాగర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను వేలంపాట ద్వారా టెండర్లను పిలిచి వేలం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన వేలంపాటలో సుమారు 15 మంది పాల్గొని వేలంపాట పాడగా విలాసాగర్ గ్రామానికి చెందిన ముంజాల చక్రపాణి అనే వ్యక్తి ఆరు లక్షల నాలుగు వేల రూపాయలకు వేలంపాటలో ఇసుక డంపు లను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఇన్చార్జి తహసిల్దార్ భాస్కర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ కార్యాలయ సిబ్బంది తిరుపతి తోపాటు విలాసాగర్ గ్రామస్తులు ప్రజాప్రతినిధులు వ్యాపారులు పాల్గొన్నారు.

## దేశభక్తిని పెంపొందిస్తున్న గురుకులాలు..

### సరస్వతీ విద్యాపీఠం బాలికల పాఠశాల ప్రారంభం

### దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి

**జమ్మికుంట, (సింగిడి) :**
దేశభక్తిని పెంపొందించడంలో విద్యాపీఠంలోని సరస్వతీ శిశు మందిరాలు, ఆవాస గురుకులాలు నియమబద్ధంగా పనిచేస్తున్నాయని దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని విద్యారణ్య ఆవాస విద్యాలయం నూతన బాలికల వసతి గృహాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చామర్తి ఉమామహేశ్వరరావు, సుధాకర్ రెడ్డి,ప్రారంభించారు.1983 వ సంవత్సరంలో అతి తక్కువ మంది విద్యార్థులతో ప్రారంభమైన ఆవాసం దినదిన అభివృద్ధి చెంది నేడు అత్యధిక మంది విద్యార్థులతో కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం బాలికల సంఖ్య 150 కి చేరుకోవడంతో అదనంగా మరొక బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వారికి ప్రత్యేక భోజనశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాలికల వసతి గృహాన్ని అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తి నిబద్ధతతో కూడిన కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని వారు వెల్లడించారు. గురుకులాలలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు దేశ భవిష్యత్తుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే తమ యొక్క విద్యాసంస్థల లక్ష్యమని లింగం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి రాజమౌళి, జిల్లా కార్యదర్శి చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,సమితి అధ్యక్షులు ముక్క జితేందర్ గుప్తా తో పాటు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

### పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

### అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, (సింగిడి):**
ఈ నెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రతా ప్రమాణాలతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, వైద్య, రవాణా, పోలీసు, విద్యుత్ శాఖల అధికారులతో పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఈసారి పరీక్షకు అదనంగా 15 నిమిషాల సమయం కేటాయించినట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు ప్రవేశ పత్రం, గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ పరిమాణ ఫోటో వెంట తీసుకురావా లని, ఆభరణాలు, చెప్పులు ధరించి రాకూడదని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో నిఘా కెమెరాలు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు సహా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు కేంద్రాలను పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. ప్రతి కేంద్రానికి అదనంగా ఒక జిల్లా అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీలు ఉండనున్నందున విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణాకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు.

## క్రీడా ప్రతిభకు నిలయంగా బ్లూ బెల్స్ హైస్కూల్

### రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ఇద్దరికి విద్యార్థులకు ప్రవేశాలు



**కరీంనగర్, (సింగిడి):**నగరంలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న బ్లూ బెల్స్ హైస్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పాఠశాలకు చెందిన జి. మోక్షిత్ కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ఎంపిక కాగా, ఎం. వేదాన్ష్ హకీంపేట్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ జంగ సునీత మనోహర్ రెడ్డి విద్యార్థులను అభి నందించి, వారి భవిష్యత్ విజయాలకు శు భాకాంక్షలు తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు గౌరవం తీసుకురావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచిం చారు. విద్యార్థుల విజయాల వెనుక ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, క్రీడా శిక్షకుల కృషిని ప్రశంసించిన ఆమె, భవిష్య త్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి పాఠశా లకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించా రు.ఉపాధ్యాయు లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

### అక్రమ చొరబాటుదారుల

# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ వైఖరి చెప్పాలి

- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది..
- మెట్రో అడ్డుకుంటున్నారన్న ప్రచారం అసత్యమని వ్యాఖ్య
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**కరీంనగర్, (సింగిడి)**
విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తే తప్పేముందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదిత ర దేశాల నుంచి అక్రమంగా వచ్చిన వారికి ఓటు హక్కు ఉండాలా లేదా అనే అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. విదేశీ ముస్లింలను భారత ముస్లింలతో పోల్చి కాంగ్రెస్ మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రధా ని నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మాన కొండూరులో ఆర్‌ఎంపీ వైద్యులతో నిర్వ హించిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మెట్రో రెండో దశ ప్రాజెక్టును అడ్డుకుం టున్నారన్న ప్రచారం లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అడ్డుకు నే ఉద్దేశం ఉంటే రాష్ట్రా నికి భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఎందుకు మంజూరు చేస్తామని ప్రశ్నిం చారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నగరాల అభివృద్ధికి కూడా కేంద్రం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తోందని చెప్పారు. గత పదేళ్ల యూపీఏ పాలనతో పోలిస్తే మోదీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత పెరిగాయని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబ ద్ధంగా పనిచేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగాలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడంతో పాటు రైతుల ఆదాయ వృద్ధి, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. బీఆర్ ఎస్‌లో మావోయిస్టు భావజాలం కలిగిన నాయకులు ఉన్నారన్న కవిత వ్యా ఖ్యల్లో వాస్తవం ఉందని బండి సంజయ్ అన్నారు. హింస, తుపాకీ సంస్కృతితో సమాజానికి మేలు జరగదని, మావోయిస్టు నాయకులే ఆ భావజాలాన్ని విడిచి పెట్టి సాధారణ జీవితం లోకి వచ్చారని గుర్తుచే శారు. ఇంకా ఆ భావజాలాన్ని కొనసాగించే వారు కూడా దానిని వీడి అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచిం చారు.ఈ దేశ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసిన ఆయ న, అక్రమంగా వలస వచ్చిన విదేశీయుల ఓట్లను మాత్రమే తొలగించా లనే ఉద్దేశమ ని తెలిపారు. ఈ అంశంపై ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకుని కాంగ్రెస్ స్పష్టమైన సమాధానం ఇవ్వాల న్నారు.

## ఘనంగా పోల్నేని రవీందర్ రావు వర్ధంతి వేడుకలు



**జమ్మికుంట, (సింగిడి):**
జమ్మికుంట మాజీ బిజెపి మండల అధ్యక్షుడు పోలినేని రవీందర్ రావు వర్ధంతి వేడుకలను మంగళవారం జమ్మికుంటలో ఘనంగా నిర్వహించారు.జమ్మికుంట మండల బిజెపి అధ్యక్షులుగా 1997 సంవత్సరంలో కొనసాగుతున్న స్వర్గీయ పోల్నేని రవీందర్ రావు వర్ధంతి సందర్భంగా జమ్మికుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు, ఈసంద ర్భంగా పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, టంగుటూరి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ప్రజా మద్దతు కూడగట్టేందుకు ఎల్ కె అద్వానీ చేపట్టిన రథయాత్ర పర్యటనను జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో విజయవంతం చేసిన రవిందర్ రావు ని టార్గెట్ చేసిన నక్సలైట్లు బిజెపి కి రాజీనామా చేయాలని హెచ్చరిం చారు, రాజీనామా చేయని యెడల చంపుతామని బెదిరించినా, భయపడని రవిందర్ రావు ప్రజా ఉద్యమాలు చేపట్టి బిజెపి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళుతున్న రవీందర్ రావు ని టార్గెట్ చేసిన సంఘవిద్రోహ శక్తులు 1997 జూన్ 15 వ తేది అర్ధరాత్రి అడ్డగించిన నరహంతక నక్సలైట్లు విపరీతంగా కొట్టి, హత్య చేశారని, రవీందర్ రావు ని భౌతికంగా దూరం చేశారు, కానీ తన ఆశయాలను దూరం చేయలేదని తెలిపారు, జమ్మికుంట గడ్డ నుంచి రవిందర్ రావు తో పాటు సమ్మిరెడ్డి దేశంకోసం బలిదానం అయ్యారని, ఎందరో త్యాగాలతో నేడు పార్టీ కేంద్రంలో మేజారిటి రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, రవీందర్ రావు త్యాగాలను స్మరించుకుంటూ పట్టణ బిజెపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్‌ఠాకూర్, జిల్లా పట్టణ పధాదికారుల తో పాటు బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు

## క్రీడా ప్రతిభకు నిలయంగా బ్లూ బెల్స్

### రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు సాధించిన ఇద్దరు విద్యార్థులు

**కరీంనగర్,(సింగిడి):**
నగరంలోని హనుమాన్ నగర్ లో ఉన్న బ్లూ బెల్స్ హైస్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు సాధించడం పట్ల పాఠశాల యాజ మాన్యం హర్షం వ్యక్తం చేసింది. పాఠశాలకు చెందిన జి. మోక్షిత్ కరీం నగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ఎంపిక కాగా, ఎం. వేదాన్ష్ హకీం పేట్ క్రీడా పాఠశా లలో ప్రవేశానికి అర్హత సాధిం చారు. ఈ సందర్భంగా పాఠ శాల కరస్పాండెంట్, చైర్మన్ జంగ సునీత మనోహర్ రెడ్డి విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు గౌరవం తీసుకురావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల విజయాల వెనుక ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషిని ప్రశంసించిన ఆమె, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందిం చారు. రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు సాధించిన జి. మోక్షిత్, ఎం. వేదాన్ష్‌లను అభినందిస్తున్న బ్లూ బెల్స్ హైస్కూల్ కరస్పాండెంట్, చైర్మన్ జంగ సునీత మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు. ఉన్నారు.

## మార్కెట్ యార్డు ఆధునీకరణకు చర్యలు

- రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్, (సింగిడి):**
కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న చర్యలు చేపట్టారు. ఇటీవల పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన అనంతరం యార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, చెట్ల కొమ్మలను కత్తిరించడం, డ్రైనేజీలను శుభ్రపరచడం, రాకపోకలకు ఆటంకంగా ఉన్న అడ్డంకులను తొలగించడం వంటి పారిశుద్ధ్య పనులను మంగళవారం ప్రారంభించారు. చైర్మన్ ఆకుల నరసన్న స్వయంగా యార్డును పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ధాన్యం విక్రయాల కోసం వచ్చే రైతులకు తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుద్ధ్యం, భద్రతతో పాటు రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా విస్తృతంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు వెలుతురు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆకుల నరసన్న మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మార్కెట్ యార్డులో పారిశు ద్ధ్యం, భద్రత, విద్యుత్, తాగునీరు, విశ్రాంతి కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ కరీంనగర్ మార్కెట్ యార్డును ఆదర్శవంతమైన వ్యవసాయ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు.

## జమ్మికుంటలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

### ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



**జమ్మికుంట, (సింగిడి)**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా జమ్మికుంటలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహిం చారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగురి ప్రశాంత్ కుమార్ మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ని తన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే జమ్మికుంటలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన, అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యు లు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు , మరియు ఆన్లైన్ ఆర్డర్స్ ,ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి , రాపిడో ,ఓలా , ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లోలి పనిచేసేటువంటి వ్యక్తుల యొక్క విషయాలను నమోదు చేసుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బత్తుల లక్ష్మయ్య , మున్సిపల్ మేనేజర్ జి .రాజిరెడ్డి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ కుమారస్వామి, మున్సిపల్ బిల్ కలెక్టర్ మున్సిపల్ మెప్మాసెక్షన్ సిబ్బంది ఆర్పీ లు శ్రీదేవి, సరిత మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేను మున్సిపల్ కార్మికుడినే...
## కార్మికుల ఆరోగ్యం సంక్షేమమే మాకు ముఖ్యం

- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్
- కార్మికుల నూతన కమిటీకి ఘన సన్మానం








**జమ్మికుంట, (సింగిడి) :**
జమ్మికుంట మున్సిపాలిటీలో ఇటీవల కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల నాయకుడిగా కొలుగూరి తిరుపతి ఎన్నికయ్యారు. మంగళవారం మున్సిపల్ కార్మిక నాయకుడు తిరుపతి ఆధ్వర్యంలో ఆయన కమిటీ సభ్యులు సహచర మున్సిపల్ కార్మికులతో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కలవడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులను చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆప్యాయంగా ఆహ్వానించి అక్కున చేర్చుకున్నారు. మున్సిపల్ కార్మిక నాయకుడిగా ఎన్నికైన కొలుగూరి తిరుపతి నీ శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో కార్మికులు ఐక్యమత్యంతో ఉండి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణాన్ని సుంద రంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాలని వారికి తెలిపారు. సమస్యలుంటే మా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తానని కార్మికుల ఆరోగ్యం సంక్షేమమే మా ప్రధమ లక్ష్యమని మీ ఆరోగ్యాన్ని కాపాడు కుంటూ పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం పనిచేయాలని వారిని కోరారు. మీలో ఒకడిగా మీతో పాటే నేను ఉంటానని మీకు సమస్య వస్తే ఆ సమస్యను పరిష్క రించే బాధ్యత నేను తీసుకుంటానని అధైర్య పడకుండా అధికారుల సూచన తో పాలకవర్గ ఆదేశాలను అనుసరిస్తూ జమ్మికుంట పట్టణ అభివృద్ధికి మీరు పాటుపడాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ కౌన్సిలర్ కొలుగూరి సురేష్ తో పాటు మున్సిపల్ కార్మికులు ఉన్నారు.

## మోదీ 12 ఏళ్ల పాలనపై 20న సమావేశం



**కరీంనగర్,(సింగిడి):**
కరీంనగర్‌లో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు కళాభా రతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరిం చుకుని మేధావుల సమావేశం నిర్వ హించను న్నారు. ఈ కార్యక్రమానికి సన్నాహ కంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఉపమేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మేధావులను స్వయంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.అలాగే, గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, పరిపాలనా విజయాలను వివరిస్తున్న ప్రత్యేక పుస్తకాలను పంపిణీ చేస్తూ సమావేశానికి హాజరుకావాలన్నారు.

# పథకాల పాలన కాదు, కుంభకోణాల పాలన

- రైతులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- మాజీ మంత్రి హరీశ్ రావు



**కరీంనగర్, (సింగిడి):**
మానకొండూర్ నియోజకవర్గం ఉద్యమ కాలం నుంచి పార్టీ కోసం ప్రాణం పెట్టి పోరాడిన కార్యకర్తల గడ్డ అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఓటమి అంచున ఉన్నవారే రాజకీయ ప్రత్యర్థు లపై కేసులు పెడతారని, తమపై పెరుగు తున్న కేసులు ప్రజల్లో తమకు పెరుగు తున్న ఆదరణకు నిదర్శనమని వ్యాఖ్యా నించారు. కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాలు అమలైతే, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనలో కుంభకోణాలే కనిపిస్తున్నాయ ని విమర్శిం చారు. పిల్లల ఉప్పు, పప్పు, గుడ్ల సరఫరా నుంచి వివిధ శాఖల వరకు అవినీతి వ్యాపించిందని ఆరోపిం చారు. మంత్రులకు తెలియకుండా ము ఖ్యమంత్రి టెండర్లు నిర్వహించి ప్రజాధ నాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నా రు.ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతు బంధు కింద రూ.19 వేల కోట్ల బకాయిలను చెల్లించ లేదని ఆరోపించా రు. రైతు బీమా పథకానికి కూడా బీమా సంస్థకు నిధులు చెల్లించలేదని పేర్కొన్నా రు. బోనస్ హామీ బోగస్‌గా మారిందని, 24 గంటల విద్యుత్ సరఫరా 11 గంటలకు పరిమితమైందని విమర్శిం చా రు. రైతు డిస్కం పేరుతో రైతులపై కొత్త భారం మోపే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ కింద బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.19, 500 కోట్లు చెల్లించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని చెప్పారు. ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వం గణాంకాల్లోనే విరుద్ధ ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఎంత భూమికి నీరు అందించిందో చెప్పాలని సవాల్ విసిరారు. అబద్ధాలు, హామీల ఉల్లంఘనలపైనే కాంగ్రె స్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం రైతులు, విద్యార్థులు, మహిళ లు సహా అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపు ఆశగా చూస్తున్నారని హరీశ్ రావు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఏం ఎలఏలు రసమయి బాలకి షన్, సుంకే రవి శంకర్, మాజీ ఏంఎల్సి నారదాస్ లక్ష్మణ్ రావు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జివి రామకృష్ణ రావు, కరీంన గర్ నగర అధ్యక్షులు, చల్ల హరిశంకర్ పాల్గొ న్నారు.

# యూరియా పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



**నాగర్ కర్నూల్ (సింగిడి):**
ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో రైతులకు అవసరమైన యూరి యా ఎరువులు సకాలంలో, పారదర్శ కంగా అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికా రులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూ ల్ పట్టణంలోని గ్రోమోర్ క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంద ర్శించి యూరియా నిల్వలు, ఆన్‌లైన్ పంపిణీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చారు. ముందుగా గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పరిమాణం, రైతుల అవసరాలు, రాబోయే రోజుల్లో ఉండే డిమాండ్‌కు అను గుణంగా నిల్వల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దుకా ణంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సు లు, మున్సిపల్ అనుమతులు, నానో యూరి యా, నానో డీఏపీ వంటి ఉత్పత్తుల లభ్యత పై కూడా వివరాలు సేకరించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత తలెత్తకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు నిరంతరాయంగా ఎరువులు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయా లని కలెక్టర్ సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నిల్వలు అం దుబాటులో ఉం చాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసా య సహ కార సంఘం (పీఏసీఎస్) కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ రైతులకు ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగు తున్న యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలిం చారు. రైతుల ఆధార్ ధృవీకరణ, బయో మెట్రిక్ నమోదు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ద్వారా జరుగు తున్న విక్రయాల విధానాన్ని పరిశీలించి, ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ కేంద్రంలో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, విక్ర యాల నమోదులు, రోజువారీ లావా దేవీల వివరాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల సరఫరా మరియు విక్ర యాల విషయంలో పూర్తి పారదర్శకత పాటించా లని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించ డం, అక్రమ నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చ రించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందిం చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఖరీఫ్ సాగు కాలంలో ఎరువుల నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేప డుతున్నామని చెప్పారు. యూరియా పంపిణీ ప్రక్రియను మరింత సమర్థవం తంగా నిర్వహించేందు కు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో పనిచేయాలని సూచించిన కలెక్టర్, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా పంపిణీ వ్యవ స్థను బలోపేతం చేయా లని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రఘునాథ్ రావు, ఆర్డీవో సురేష్ బాబు, నాగర్ కర్నూ ల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి పూర్ణచంద్రారెడ్డి ఉన్నారు.

## ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటా

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):**
కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. కవకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా తమ సమస్యలను తెలియజేసే అవకాశం కల్పిస్తున్న డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ రహదారులు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి మొత్తం 235 కాల్స్ రాగా, అందులో 62 మంది ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలను నేరుగా మా దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వారి సమస్యలపై వివరణ ఇవ్వడంతో పాటు పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. కాల్ ద్వారా సంప్రదించ లేకపోయిన ప్రజలు నేరుగా కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధు మోహన్

**గద్వాల బ్యూరో (సింగిడి)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (యస్ ఐ ఆర్) రూపకల్పన ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండాపారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుమోహన్ సూచించారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు హాలులో గద్వాల రూరల్ మరియు అర్బన్ బిఎల్ఓ లు, బిఎల్ఏలు, సూపర్వైజర్లకు ఓటర్ జాబితా రూపకల్పనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధు మోహన్ మాట్లాడుతూ, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా ( ఎస్ఐఆర్) ను పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఈనెల 25 నుండి వచ్చేనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలన్నారు. డోర్ లాక్ ఉన్నట్లయితే ఒకటికి మూడుసార్లు ఇండ్ల వద్దకు వెళ్లి ఫారాలను అందించాలని సూచించారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి వివరాలను సేకరించి ఓటర్ జాబితా నుండి అట్టి పేర్లను తొలగించాలన్నారు. అర్హత గల ఓటర్లు కచ్చితంగా తమ పేర్లను నమోదు చేసుకోనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, బిఎల్ఓ, బిఎల్ఏ లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకు సమానంగా యూరియా అందిస్తాం


### మోర్తాడ్ మండల వ్యవసాధికారి హరీష్ వెల్లడి



**ఆర్మూర్, సింగిడి):**
బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలో గల రైతులు మండలంలోని రెండు సొసైటీల ద్వారా, మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాలలో గల ప్రైవేట్ డీలర్ల ద్వారా యాప్ ద్వారా రైతులు యూరియా కోసం బుక్ చేసుకోవాలని, యాప్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి రైతుకు సమానంగా యూరియా అందించడం జరుగు తుందని మోర్తాడ్ మండల వ్యవసాయ అధికారి హరీష్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. మోర్తాడ్ మండలంలో మొత్తం రైతుల సంఖ్య 8,200 కలిగి ఉన్నారని, ఇప్పటివరకు యూరియా బుకింగ్ యాప్ ద్వారా, యూరియా కోసం బుక్ చేసుకున్న రైతుల సంఖ్య 4,033 అని వ్యవసాధికారి హరీష్ తెలిపారు. ఇప్పటివరకు బుకింగ్ యాప్ ద్వారా చేస్తున్న రైతులు 10,400 మంది రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ఎరువుల పంపిణీ కొరకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ విరాళం అందులో అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఉందని, ఈ నేపథ్యంలో మోర్తాడ్ మండలంలోని రైతులు ఎరువుల లభ్యత పైన ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. మోర్తాడ్ మండలానికి సరిపడా యూరియా సరఫరా రోజువారిగా రావడం జరుగుతుందన్నారు. పర్టీ లైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఏంటి ఇష్టమైన విధివిధానాలు, రైతుల సంఖ్య, సాగు భూమి యొక్క విస్తీర్ణం పరిగణలోకి తీసుకొని యూరియాను ప్రతి రైతుకు అందించడం జరుగుతుందన్నారు. పంటకు అవసరం ఉన్న దానినిబట్టి యూరియాను బుక్ చేసుకోవాలని రైతులను వ్యవసాధికారి కోరారు. ఈ వర్షాకాలం రైతులందరికీ సరిపడే యూరియా అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు అవసరమేరకు సమానంగా యూరియా అందించడం జరుగుతుం దని మోర్తాడ్ మండల వైద్యాధికారి హరీష్ రైతులకు తెలియజేశారు.

## హిందువులంతా ఐక్యం కాకుంటే పిప్రి మరో బెంగాల్ గా మారుతుంది

### బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేసిన ఎంపీ



**ఆర్మూర్ (సింగిడి):**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలో గత పది రోజుల క్రితం అప్పు అడిగినందుకు, అప్పుతీసుకున్న ఒక ముస్లిం వ్యక్తి, అప్పు ఇచ్చిన వ్యక్తిఇంటిని పెట్రోల్ పోసి నిప్పు పెట్టి దగ్ధం చేయడం ఈ విషయం తెలుసుకున్న జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మంగళవారం రోజున జిల్లా లో ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామాన్ని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ సందర్శించి, అప్పు అడిగినందుకు అప్పు ఇచ్చిన రాజమల్లు కుటుంబాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, దగ్ధమైన ఇంటిని సందర్శించి జిల్లా ఎం.పీ. ధర్మపురి అరవింద్ స్వయంగాపరిశీలించి రాజమల్లు అనే బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ, పిప్రి గ్రామంలో పదివేల కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో, 10 కుటుంబాలు ఉన్న ముస్లింలు, ఒక కుటుంబం వారు అప్పు అడిగినందుకు రాజమల్లు అనే హిందూ కుటుంబాన్ని పెట్రోల్ పోసి కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఇంటిని దగ్ధం చేస్తుంటే 9 90 కుటుంబాల వారు చూస్తూ మిన్న ఉండి పోవడం విడ్డూరంగా ఉందన్నారు. పది కుటుంబాలు ఉన్న ముస్లింలకు 990 కుటుంబాలు ఉన్న హిందువులు ఐక్యం కాకుంటే, ఐక్యంగాఉండకపోతే మరోబెంగాల్ గా మారుతుందన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు ఏ గ్రామంలో తలెత్తకుండా హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. రాజమల్లు బాధితుని ఇల్లు దగ్ధమై 25 లక్షల నష్టం వాటిల్లితే, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు 13 లక్షలు ఇప్పించడం పట్ల జిల్లా పార్లమెంటు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ముస్లింలను గ్రామంలో అక్కున చేర్చుకుంటే మరో బెంగాల్ గా తయారు చేస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, పలువురు బిజెపి నాయకులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### డీఈవో ఎ.రమేష్‌కుమార్



**నాగర్ కర్నూల్, (సింగిడి) :**
తెలకపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ తెలకపల్లి, యూపీఎస్ రాకొండ పాఠశాలల్లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎ. రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శు భారంభం చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సంద ర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించిన డీఈఓ, విద్యార్థుల హాజరు శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, క్రమశిక్షణతో చదువు కుంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా డీఈఓ ఎ. రమేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటుంద న్నారు. సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని, విద్యార్థులు పాఠశాలకు నిత్యం హాజరై పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఉపాధ్యాయులు కూడా బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పృథ్వీరాజ్



**నాగర్ కర్నూల్ (సింగిడి) :**
నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన పృథ్వీ రాజును బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ. పార్టీ పదాధికారుల అందరి సంపూర్ణ సహాయ సహకా రాలతో నిరంతరం పార్టీ పని జరగడం కోసం కృషి చేయడం జరుగు తున్నది. పార్టీ నాపై ఉంచిన విశ్వాసంతో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర కమిటీ జుజ సభ్యుడు, ఉమ్మడి జిల్లా జోన్ ఇంచార్జ్ వంటి పలు బాధ్యతలను నిర్వహించే అవకాశం లభించింది. నేడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించడం నాకు ఎంతో సంతోషదా యకం. పార్టీ నాకు అప్పగించిన ప్రతి పదవిని ఒక బాధ్యతగా స్వీకరించి, పార్టీ కార్యకర్తగానే భావించుకుని, సహచర నాయకులు మరియు కార్య కర్తల సహకారంతో పని చేయడం జరిగింది. నేడు అప్పగించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలకు కూడా పూర్తి న్యాయం చేస్తానన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ (దీస్రా) జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి (నాలుగు పర్యాయాలు) మాయావతి ఆశీస్సులతో జాతీయ సమన్వయకర్త, యువ నాయకులు ఆకాష్ ఆనంద్ పర్యవేక్షణ లో నాపై విశ్వాసం ఉంచి బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నన్ను నియమించిన జాతీయ కోఆర్డినేటర్లు అతర్ సింగ్ రావ్ (జుఇ. మీజ-ఖ), సురేష్ ఆర్య , రాష్ట్ర కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ రాష్ట్ర రథసారథి, మాజీ డిప్యూటీ మేయర్ బడంగ్‌పేట్. ఇబ్రాం శేఖర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## యూరియా యాప్‌ను రద్దు చేయాలని రాస్తారోకో



**ఆర్మూర్, (సింగిడి):**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన యూరియా యాప్ ను రద్దు చేయాలంటూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని పోచంపాడు ఎక్స్ రోడ్ వద్ద టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి మంగళవారం రోజు ఉదయం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, యూరియా పంపిణీకి అమలు చేస్తున్న యాప్ విధానాన్ని వెంటనే రద్దుచేసి, గతంలో మాదిరిగానే సహకార సంఘాల ద్వారా, అన్ని పర్టీ లైజర్ దుకాణాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియాతో పాటు, ఎరువులు సైతం అందించాలని వారు డిమాండ్ చేశారు. యాప్ విధానం కారణంగా స్మార్ట్ ఫోన్ లేని మహిళలు, వృద్ధులు, ఫోన్ పై అవగాహన లేని రైతులు సైతం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యాప్ ద్వారా కాకుండా, పాత పద్ధతిలోనే యూరియాను సొసైటీలకు సరఫరా చేస్తే, రైతులు నేరుగా సొసైటీ కి వెళ్లి డబ్బులు చెల్లించి ఎరువులు కొనుగోలు చేసుకుంటారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే యూరియా యాప్ ను ఎత్తివేయాలని, రైతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల ముందు, అవసరమైతే రాష్ట్ర అసెంబ్లీ ముందు రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మిస్బా వద్దిన్, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, మండల మార్కెట్ కమిటీ నాయకులు నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ ఎలకటూరు గంగారెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు

- లింగంపల్లి సర్పంచ్ కొండల్ రావు
- ఆమంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయి.
- ఆప్రధానోపాధ్యాయురాలు గడుసు జ్యోతి



**నాగర్ కర్నూల్ ( సింగిడి):**
ప్రభుత్వ హల్లాదకరమైన వాతావరణం సమాజంపై స్పృహ ఆటలు మొదలగు కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని యంగంపల్లి గ్రామ సర్పంచ్ కొండలరావు అన్నారు మంగళవారం తాడూరు మండల పరిధిలోని యంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను విద్యా ర్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేస్తోందని, అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పాఠశాల యూనిఫాం, నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. దీంతో పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. "ప్రభుత్వ బడులు మన అమ్మలాంటివి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గడుసు జ్యోతి మాట్లాడుతూ, లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు పాఠశాలల్లో చదివించినప్పటికీ పిల్లలకు సమాజంపై సమగ్ర అవగాహన పెరగడం లేదన్నారు. చదువుతో పాటు మానసిక కాసం, ఆటలు, పాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను ఉత్తేజపరచి మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యం, గ్రామ కార్యదర్శి నర్సింహులు, గ్రామ పెద్దలు శంకర్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఆశా వర్కర్, నాగమ్మ తో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

### చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్




**నారాయణపేట ప్రతినిధి (సింగిడి):**
విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారా యణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలన్నారు. ఈ జిల్లా నుంచి గతంలో బాసర త్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశా ల నుంచి కూడా త్రిపుల్ ఐ టి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకాలన్నారు. లెక్కలను సులువుగా ఎలా చేయాలో విద్యార్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థులకు పదో తరగతే పునాది లాంటిది అన్నారు. రాబోయే పదేళ్ల లో మీరు ఎలా ఉండాలో నోట్ బుక్ లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తరగతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావాలన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం టాపర్ ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ ఎం కు సూచించారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగ శాల, గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు.

**చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్...**
జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్ వాడీ )చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధికారి బాలాజీ, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

- చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం
- అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణపై కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ (సింగిడి) :**
పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి , అన్ని అంగన్‌వాడీల తనిఖీలు చేప ట్టి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం నాగర్ కర్నూల్ జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగు పరచడంతో పాటు పోషకాహార లోపంతో బాధపడు తున్న పిల్లల ఆరోగ్య స్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని, మంగళ వారం మహిళా మరియు శిశు సంక్షేమ, దివ్యాంగుల మరియు వృద్ధుల సంక్షేమ శాఖ అధికా రులతో నిర్వహించిన సమీక్షసమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయి లో సందర్శించి వాటి పనితీరును సమగ్రంగా పరిశీలించాలని, ముఖ్యంగా పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి పూర్తి వివరాలతో సమాచార నిధి రూపొం దించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, పోషకాహార స్థితి, అందుతున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. జాతీయ బాల ఆరోగ్య రక్ష బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్షేత్రస్థా యిలో తనిఖీలు, పర్యవేక్షణ కార్యక్ర మా లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశిం చా రు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రా లపై పర్యవేక్ష కులు మరియు శిశు అభి వృద్ధి ప్రాజెక్టు అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రతి కేం ద్రాన్ని సందర్శించి పరిశీలన నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు సమర్పిం చాలని ఆదేశిం చారు. ప్రత్యేకించి నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల్ల ఏజె న్సీ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపై మరింత శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అక్కడి పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల పూర్తి వివరాలను సేకరించి సమగ్ర నివేదిక అందించాలని, తీవ్ర పోషకాహార లోపం మరియు మధ్యస్థ పోషకాహార లోపం కేటగిరీల్లో ఉన్న పిల్లలను తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరం తరం పర్యవేక్షించాలని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమన్వయం పెంచుకుని అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పిల్ల ల ఆరోగ్య పరీక్షల వివరాలు, చికిత్సలు, పోషకాహార చర్యలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారు లకు తెలిపారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహార స్థితి మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్య మని, క్షేత్రస్థాయి లో అధికారులు సమర్థ వంతంగా పనిచేసి నిర్దేశిత గడువులోపు నివేదికలు అందజే యాలని స్పష్టం చేశా రు. పోషకాహార లోపం నిర్మూలనలో అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేసి జిల్లా ను ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

# ఎడిటోరియల్

Editorial

## దేశానికిమూడు
# సంక్షోభాల ముప్పు...
### పెట్టుబడిదారీ విధాన వైఫల్యాల ప్రతిబింబం!

భారత ఆర్థికవ్యవస్థ మరోసారి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పెరుగు తున్న ముడి చమురు ధరలు... "సూపర్ ఎల్‌నినో" ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులు... అసాధారణ వడగాల్పులు, బలహీనమైన వర్ష పాతం... ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభం వైపు నెడుతు న్నాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ సంక్షోభాలను కేవలం ప్రకృతి వైపరీత్యాలుగా లేదా అంతర్జాతీయ పరిణామాలుగా మాత్రమే చూడటం సరైంది కాదు. ఇవి అసలు పెట్టుబడిదారీ విధానం నిర్మించిన అసమాన ఆర్థిక నిర్మాణాల ఫలితం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పటికీ చౌకైన ఇంధనం, వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన రుతుపవనాలపై ఆధారపడి ఉన్నాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా అమలవుతున్న నూతన ఆర్థిక విధానాలు ఈ పునాదులను బలహీనపరిచాయి. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ ఆధారిత అభివృద్ధి నమూనాను ప్రోత్సహించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ మార్కెట్ కుదుపులకు బానిసగా మారింది. హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన ఈ మార్గంలో చిన్న అంతరాయం వచ్చినా దాని ప్రభావం భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలపై తీవ్రంగా పడుతుంది. ఇది కేవలం మార్కెట్ సమస్య కాదు; ప్రపంచ సామ్రాజ్యవాద శక్తుల మధ్య ఆధిపత్య పోరాటం ఫలితం. అమెరికా, నాటో శక్తులు, పశ్చిమ దేశాల భౌగోళిక రాజకీయ జోక్యాలు ప్రపంచ ఇంధన మార్కెట్లను అస్థిరం చేస్తున్నాయి. కానీ ఆ భారాన్ని మోసేది మాత్రం సాధారణ ప్రజలే. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్నీ ఖరీదవుతాయి. చివరకు ద్రవ్యోల్బణం రూపంలో ప్రజల జేబులు ఖాళీ అవుతాయి.

**ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే..**

దేశం ఎందుకు ఇంకా విదేశీ చమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది? ప్రత్యామ్నాయ ఇంధన రంగాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమయ్యాయి? దీనికి సమాధానం స్పష్టమే. కార్పొరేట్ చమురు కంపెనీల లాభాల కోసం ప్రభుత్వ విధానాలు నడుస్తున్నాయి. ప్రజల అవసరాల కంటే మార్కెట్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ఇలాంటి సంక్షోభాలను మరింత పెంచుతోంది. "సూపర్ ఎల్‌నినో" ప్రభావం, తీవ్ర వడగాల్పులు, వర్షాభావం వంటి పరిణామాలు ఇప్పుడు సాధారణ వాతావరణ మార్పులు కాదు. ఇవి ప్రపంచ పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనా సృష్టించిన పర్యావరణ సంక్షోభాల ప్రతిఫలాలు. నిరంతర పారిశ్రామికీకరణ, అదుపు లేని నగరీకరణ, బొగ్గు–చమురు ఆధారిత పరిశ్రమల విస్తరణ, ప్రకృతి వనరుల దోపిడీ – ఇవన్నీ కలిసి భూమి వాతావరణ సమతుల్యతను ధ్వంసం చేశాయి. భారతదేశంలో దీని ప్రభావం అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఇంకా కోట్లాది మంది రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తు న్నారు. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బతింటాయి. పంటలు దెబ్బతింటే రైతు ఆదాయం కూలిపోతుంది. గ్రామీణ కొనుగోలు శక్తి పడిపోతుంది. దాని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది.

**కానీ ప్రభుత్వాల ప్రాధాన్యత ఏమిటి?**

రైతుకు కనీస మద్దతు ధర ఇవ్వడంలో వెనుకంజ... సాగునీటి విస్తరణలో నిర్లక్ష్యం... వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి నెట్టే చట్టాలు... ఇవన్నీ వ్యవసాయ రంగాన్ని మరింత బలహీనపరుస్తున్నాయి. వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రభుత్వాలే నాశనం చేస్తున్నాయి. చమురు ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం కలిసి ఆహార ద్రవ్యోల్బ ణాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే సామాన్య ప్రజలు కూరగాయలు, పప్పులు, వంటనూనెల ధరలతో సతమతమవుతున్నారు. మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కార్మికులు, చిన్న ఉద్యోగులు, కూలీలు జీవన వ్యయ భారం తట్టుకోలేకపోతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏమిటి? కార్పొరేట్ పన్నుల తగ్గింపు, ప్రైవేటీకరణ, ప్రజా రంగ సంస్థల అమ్మకాలు. ద్రవ్యోల్బణం పెరిగినా వేతనాలు పెరగడం లేదు. ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ఇది సాధారణ ఆర్థిక మందగమనం కాదు; ఇది సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి ప్రజల అవసరాల కోసం కాదు, లాభాల కోసం జరుగుతుంది. అందుకే ధాన్యం గోదాముల్లో పాడైపోతున్నా పేదవాడు ఆకలితో అలమటిస్తాడు. రైతు నష్టాల్లో మునిగిపోతున్నా కార్పొరేట్ అగ్రి కంపెనీలు లాభాలు ఆర్జిస్తాయి. చమురు ధరలు పెరిగితే సామాన్యుడు ఇబ్బంది పడతాడు కానీ పెద్ద కంపెనీలు మాత్రం మరింత లాభాలు చూస్తాయి.

**పరిష్కారం ఏమిటి?**

ఈ సంక్షోభాలకు తాత్కాలిక ఉపశమనాలు సరిపోవు. వ్యవస్థాత్మక మార్పులు అవసరం. ప్రజా అవసరాల ఆధారంగా ఆర్థిక విధానాలు రూపొందించాలి. వ్యవసాయానికి భారీ పెట్టుబడులు పెట్టాలి. ప్రజా రవాణా, ప్రత్యామ్నాయ ఇంధన రంగాలను ప్రభుత్వ ఆధీనంలో బలోపేతం చేయాలి. కార్పొరేట్ దోపిడీని నియంత్రించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలి. ఉపాధి, కనీస వేతన హామీలను పెంచాలి. అత్యంత ముఖ్యంగా – ప్రకృతి వనరులను లాభాల సాధనంగా కాకుండా ప్రజల సామూహిక ఆస్తిగా చూడాల్సిన దృక్పథం అవసరం. మార్కెట్ ఆధారిత అభివృద్ధి కాదు, మానవ అవసరాల ఆధారిత అభివృద్ధి సమాజాన్ని కాపాడగలదు. ఈ మూడు సంక్షోభాలు మనకు ఒక గాఢమైన హెచ్చరిక ఇస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానం మనిషిని మాత్రమే కాదు, ప్రకృతినీ సంక్షోభంలోకి నెడుతోంది. ప్రజల శ్రమతో సృష్టించిన సంపదను కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకరించే ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయం గురించి దేశం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

## సెక్స్ వర్కర్స్ రహిత
# భారతాన్ని నిర్మించలేమా !




సెక్స్ వర్కర్స్ లేదా వ్యభిచారవృత్తి చేసే అభాగ్య మహిళలను నీచంగా, అత్యంత చులకనగా చూస్తున్నది నేటి పౌర సమాజం. సెక్స్ వర్కర్లకు కనీస గౌరవం, మర్యాద, భద్రత, మానవ హక్కులు లేని సమాజంలో మనం ఉన్నాం. రెండు పూటలు తినడానికి పడుపు వృత్తి ఊబిలోకి లాగేయబడుతున్నారు నిరుపేద మహిళలు. వేశ్యావాటికలు విటులకు మాత్రమే శారీరక సుఖాలను అందించే కేంద్రాలు. పుష్పను నలిపేస్తూ రాక్షస ఆనందాన్ని పొందే మృగాళ్లు ఉన్న సమాజంలో వ్యభిచారం కొనసాగుతూనే ఉంటుంది. తమను తాము పోషించుకోవడానికి వేరే మార్గాలు లేకపోవ టంతో పడుపు వృత్తి ఊబిలో చిక్కిన వారే అధికంగా ఉన్నారు. విడాకులు తీసుకున్న మహిళలు, సమాజ ఆదరణ కోల్పోయిన వారు, కుటుంబాల నుంచి వెలి వేయబడిన మహిళలు, బలవంతంగా ఈ వృత్తిలోకి లాగబ డిన మహిళలు లేదా కౌమార యువతులు వ్యభిచారమే ఒక వృత్తిగా ఒళ్లును అమ్ముకొని, అయిష్టంగా, మరో మార్గం లేక వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్నారు. సెక్స్ వర్కర్ల వృత్తి వల్ల హెచ్‌ఐవి-ఎయిడ్స్‌తో పాటు ఇతర సుఖ వ్యాధులు విస్తరిస్తున్నాయి.

**సెక్స్ వర్కర్స్ హక్కుల పోరాటానికి 50 ఏండ్లు:**

ప్రపంచ చరిత్రలో సెక్స్ వర్కర్స్ హక్కుల పోరాటానికి 51 ఏండ్లు నిండాయి. 02 జూన్ 1975న ఫ్రాన్స్‌లోని లియాన్ ప్రాంత సెయింట్-నిజియర్ చర్చ్ వద్ద సెక్స్ వర్కర్లు ఏకమై తమ భద్రత, గౌరవం, మర్యాద, శ్రామిక హక్కులు, కనీస మానవ హక్కుల కోసం 8-రోజుల పాటు ఆందోళన చేపట్టడం కారణంగా వేశ్యల సమస్యల పట్ల ప్రపంచ దేశాలు ఆలోచించడం ప్రారంభించాయి. ఈ సంఘటనను గుర్తుగా ప్రతి ఏట 02 జూన్‌న "అంతర్జాతీయ సెక్స్ వర్కర్స్ దినం(ఇంట ర్నేషనల్ సెక్స్ వర్కర్స్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. సెక్స్ వర్కర్లు కూడా సామాన్య మనుషులే అని, తినడం కోసం అయిష్టంగా పడుపు వృత్తిలోకి దిగాల్సి వచ్చిం దని, వారికి కూడా మానవ హక్కులు ఉంటాయని గమనించాలి. వేశ్యల పట్ల నీచమైన భావనలు, ఆ వృత్తి పట్ల అసహ్యకర ఆలోచనలు కలిగి ఉన్న పౌర సమాజం, ఆ వృత్తిలో నలుగుతున్న మహి ళల పట్ల కనీస గౌరవం చూపించడం, వారికి అవగాహన కల్పించడం, వారి ఆరోగ్యానికి రక్షణ గొడుగులు పట్టడం, వారి పిల్లలకు కనీస అవసరాలు తీర్చడం నిరంతరం కొనసాగాలి.

**భారత్‌లో భారీ లైంగిక వాణిజ్య పరిశ్రమ:**

భారత దేశంలో షరతులతో కూడిన పరిమిత స్థాయి వ్యభిచారం చట్టబద్ధమైనదే అయినప్పటికీ వేశ్యా గృహాలు కోరడం, వాటిని స్వంతం చేసు కోవడం, నిర్వహించడం, హోటల్‌లో వ్యభి చార ం, పిల్లల వ్యభిచారం, పింపింగ్, పాండరింగ్, క్రాలింగ్ లాంటివి మాత్రం చట్టవిరుద్ధం. 2016 వివరాల ప్రకారం, భారత్‌లో దాదాపు 6,57, 829 మంది వేశ్యలు ఉన్నారని, వీరిలో 35 శాతం వరకు 18 ఏండ్ల లోపు యువతులు ఉండవచ్చని అంచనా. ఇతర అనధికారిక అంచనాల ప్రకారం, మరో 3 మిలియన్ల మంది సెక్స్ వర్కర్లు ఉన్నారని తెలుస్తున్నది. 1997 నుంచి 2004 మధ్యలో వేశ్యల సంఖ్య 50 శాతం పెరిగినట్లు తెలుస్తున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద వాణిజ్య లైంగిక పరిశ్రమగా పరిగణించబడుతూ బిలియన్ డాలర్ల విలువైనదిగా గుర్తించబడుతు న్నది. ఇది సెక్స్ టూరిజంలో కూడా అమితంగా ఆకర్షిస్తున్నది. భారత్‌లో వ్యభిచారం వివిధ రూపాల్లో వ్యక్తం అవుతున్నది. వేశ్యా గృహాలు, వీధుల్లో నిలబడి విటులను ఆకర్షించే వ్యభిచా రాలు, టెలిఫోన్ ద్వారా అపాయింట్‌మెంట్ ఇచ్చే కాల్ గర్ల్స్, వినోదం కోసం అందుబాటులో ఉండే ఎస్కార్ట్ ఏజెన్సీలు, ప్రైవేట్ నివాసాలు, మసాజ్ – స్పా పార్లర్లు, హోటళ్లు, నైట్ క్లబ్బులు, బార్లు, వర్చువల్/సైబర్/ఫోన్ సెక్స్ సేవలు, నృత్యకారుల రూపంలో దేవదాసీలు, లైంగిక అక్రమ రవాణా, ఆన్‌లైన్ సంస్థలు లాంటి రూపాల్లో వ్యభిచార వృత్తి కొనసాగుతున్నది. భారత్‌లోని సోనాగాచి – కోల్‌కతా, కామాతిపురా – ముంబై, బుధ్వార్‌పేట్ – పూణే, ముజఫర్‌పూర్, వారణాసి, న్యూఢిల్లీ, నాగ్‌పూర్, గ్వాలియర్, ప్రయాగ్‌రాజ్ లాంటి జిల్లాల్లో రెడ్-లైట్ ఏరియాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. వ్యభిచార వృత్తిని ప్రభుత్వాలు క్రమంగా తగ్గించడానికి కృషి జరగాలని, పడుపు వృత్తి ఎప్పటికీ సమాజ గౌరవాన్ని పొందలేదని, కనీసం వారి తర్వాతి తరం అయినా సన్మార్గంలో నడవడా నికి తగు చేయూతను అందించాలని కోరుకుం దాం, సెక్స్ వర్కర్లు లేని సమాజాన్ని నిర్మిద్దాం.



డాక్టర్. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బోనాల సందడి...!

**పాలేరు, సింగిడి:** నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. మండలం లోని ఆరెగూడెంలో గంగమ్మ తల్లి దైవం కు బోనాల పండగ ను నిర్వహించారు. గ్రామం లో మహిళలు బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు లక్కి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం లో బొడ్డాయి వద్ద బోనాలు సమర్పించారు. భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వేణు, సొసైటీ చైర్మన్ శాగ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



## మొగులు మీద
# మలుగని బొమ్మ

నీ తలపు రాగానే
నా కంటి పంజరాన చిక్కిన
కన్నీటి చిలుకలను మోక్షం కలిగింది తెల్లా
నా చెంపల తీరాన ఆవి పారాడుతున్నపుడు
ఇసుకతిన్నెల మీద తేల పారాల
గురుతులు వదిలినట్లు
చెంప పొదవునా కన్నీటి చిలుకలు తిరిగిన
గురుతులే

నా ఆశల నెలవంక నీవు
ఎదిగెదిగి వెన్నెలవుతుంది
నా మోమెంత ప్రకాశం అవుతుందో
నా జీవితాన నిత్యం పారాడే
ప్రకృతి ప్రమతి నీవని
ఎన్నెని మార్లు గర్వంగా జబ్బలు
చరుచుకున్నానో

నీవు ఉత్త ఇష్టమైన ఊహవు కాదు
ఊపిరిగ నేనాని
ఆక్సిజన్లో రెండు మూలకాలు
ఆక్సిజన్ మాత్రమే కాని...
నా శ్వాసలో ఒక మూలకం ఆక్సిజన్ ఐతే
నీ ఆలోచన నాకు ఇంకో మూలకమైతది
నీ తలపు లేకుండా పిట్ట శ్వాస కూడా
నాకు ఊపిరిని కలిగించు

నీ యాది వసంతాన్ని ముందే పిలిచి
జీవితాన అలుముకున్న శిశిరాలను తరిమేది
ఇప్పుడంతా తలకిందులైంది
నీ ఊహ మనసులో మెదిలితే చాలు
ఎండిన ఆకులతో కన్నీళ్లు టపటపా రాలి
మొదుకారిన అదవనిసొంటి బతుకును
మొగులుమీద మలుగని బొమ్మగా గీసి
లోకం మీదకి విసురుగా విసిరింది తెల్లా...

- దీపిక.వి
మల్లంపల్లి, ములుగు
సెల్: 8464030808

## అంగడి సరుకు...

బుక్కెడు బువ్వ కోసం..
ఆమె అగ్గువ అంగడి సరుకై..
అతివ దేహమే వ్యాపార వస్తువై..
మనసును నిత్యం చంపుకొని..
పడుపు వృత్తి వద్దన్నా..
కామాంధుల కబంధ హస్తాల్లో చిక్కి..
మృగాళ్లకు శరీరాన్ని అర్పిస్తోంది !

నాలుగు గోడల బందిఖానాలో..
చీకట్లో నిశ్శబ్ద రోదనల నడుమ..
కంటిలు బిగిసిన క్రూరుల చేతుల్లో..
మానసం ముద్దగా నలిపెపోతూ..
నిత్యం పువ్వులా వాడిపోతూ..
కష్టాలన్నీ కడలిలో ఎదురీదుతూ..
కన్నీళ్లను మదిలో దాచుకుంటోంది !

లేని నవ్వును తెచ్చి పెట్టుకొని..
రెండు పూటల కూడు, గుడ్డ కోసం..
పలుమార్లు పరువుల మారిపోతూ..
జీవచ్ఛవంలా వేశ్య వాటికల్లో..
ప్రతి క్షణం చస్తూ.. లేస్తూ.. అర్పిస్తూ..
పడుపు వృత్తిలో చిక్కిశల్యమవుతోంది !

విటుల వికృత రాక్షస చేష్టలకు..
తన దేహాన్ని క్రీడా మైదానంగా మార్చిన..
ఆమెకు ఇల్లు..తన వాళ్ల అనవాళ్లు లేని..
బజారులో నిలబడి భ్రమిసిలాడుతూ..
ఆకలి కేకలతో ఆక్రోశం పలుకుతూ..
తన ఉనికికే కోల్పోయింది అంగడి బొమ్మ
నాటి ఇంటి కూతురు..నేటి నిస్సహాయ స్త్రీ !

మధుపాలి
9949700037

# నిశ్చయ తాంబులాల వేడుక

**హాజరైన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు..**

**పాలేరు, సింగిడి:** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కోర్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగుల్ పాషా ఏ హుస్సేన్ బి దంపతుల కుమార్తె నిశ్చయతాంబులాల వేడుకకు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు హాజరై హసీనాను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో కోర్లగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారావు,షేక్ లాల్ పాషా, షేక్ మహబూబ్ పాషా,గడిపల్లి నవీన్, షేక్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు... ప్రపంచానికి ముప్పు...



ప్రపంచ రాజకీయాలు మరోసారి ప్రమాదకర మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటికే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మందగమనం వంటి సవాళ్లతో సతమతమవుతున్న ప్రపంచం ఇప్పుడు ఇరాన్–ఇజ్రాయెల్–అమెరికా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ఆందోళనగా గమనిస్తోంది. పశ్చిమాసియాలో చెలరేగుతున్న ఈ సంక్షోభం కేవలం మూడు దేశాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఇంధన భద్రతను, అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంది. ఇజ్రాయెల్ భద్రత పేరుతో అమెరికా మద్దతు కొనసాగుతుండగా, తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ప్రతిఘటిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీకార దాడులు, క్షిపణి ప్రయోగాలు, సైనిక హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలను పెంచుతున్నాయి. చిన్న ఘర్షణగా ప్రారంభమైన ఉద్రిక్తత పెద్ద యుద్ధంగా మారితే దాని ప్రభావం ప్రపంచంలోని ప్రతి దేశంపై పడే ప్రమాదం ఉంది.

**చమురు రాజకీయాలే అసలు కేంద్రబిందువు**

పశ్చిమాసియా అంటే కేవలం యుద్ధాలు మాత్రమే కాదు. ప్రపంచ చమురు నిల్వలకు కేంద్రం కూడా. ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషించే హోర్ముజ్ జలసంధి ఇరాన్ పరిధిలో ఉండటం వల్ల అక్కడ ఏ చిన్న ఉద్రిక్తత జరిగినా ప్రపంచ మార్కెట్లు కుదేలవుతాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం అన్నీ పెరుగుతాయి. ఇప్పటికే ప్రపంచ దేశాలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో పశ్చిమాసియాలో యుద్ధం మరింత విస్తరించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ అవుతుంది.

## భారత దౌత్యానికి పరీక్ష

**భారత్‌కు ఎందుకు ఆందోళన?**

భారతదేశం తన ఇంధన అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందులోనూ పశ్చిమాసియా దేశాల పాత్ర అత్యంత కీలకం. చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజల జీవన వ్యయం అధికమవుతుంది. అంతేకాదు, గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. యుద్ధం తీవ్రరూపం దాల్చితే వారి భద్రత, ఉద్యోగాలు, జీవనోపాధి ప్రశ్నార్థకమవుతాయి. విదేశీ మారకద్రవ్య ప్రవాహంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

**మోదీ దౌత్యానికి అగ్నిపరీక్ష**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ప్రస్తుతం అత్యంత సున్నితమైన విదేశాంగ సవాలును ఎదుర్కొంటోంది. అమెరికా భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామి. ఇజ్రాయెల్ రక్షణ రంగంలో కీలక మిత్రదేశం. మరోవైపు ఇరాన్‌తో కూడా భారత్‌కు చారిత్రక, వ్యాపార, వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ ఒక్క దేశానికి పూర్తిగా మద్దతు ప్రకటించడం భారత్‌కు ప్రయోజనకరం కాదు. అందుకే భారత్ "శాంతి, చర్చలు, దౌత్యపరమైన పరిష్కారం" అనే విధానాన్ని అనుసరిస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో తటస్థతను కాపాడుకుంటూనే జాతీయ ప్రయోజనాలను రక్షించడం మోదీ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

**యుద్ధం ఎవరికీ శాశ్వత పరిష్కారం కాదు**

చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే యుద్ధాలు విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తాయి. ప్రాణనష్టం, ఆర్థిక నష్టం, శరణార్థుల సమస్యలు, మానవతా సంక్షోభాలు తప్ప శాశ్వత పరిష్కారాలు ఇవ్వవు. మొదటి ప్రపంచ యుద్ధం నుంచి ఉక్రెయిన్ యుద్ధం వరకు ప్రపంచం ఇదే పాఠాన్ని మళ్లీ మళ్లీ నేర్చుకుంటూనే ఉంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాలు కూడా సైనిక చర్యల కంటే దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ శక్తులు శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలి.

**ప్రపంచానికి అవసరం శాంతి**

ప్రపంచం ప్రస్తుతం యుద్ధాలను కాదు, అభివృద్ధిని కోరుకుం టోంది. పేదరికం, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత వంటి సమస్యలు మానవాళి ముందు ఉన్నాయి. వీటిని పరిష్కరించాల్సిన సమయంలో దేశాలు యుద్ధాల్లో చిక్కుకోవడం దురదృష్టకరం. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రపంచ శాంతికి మద్దతు ఇస్తూ సమతుల్య దౌత్యాన్ని కొనసాగించాలి. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుంది. లేదంటే దాని ప్రభావం ప్రతి కుటుంబం వంటగదిలోని ఖర్చుల నుంచి దేశాల ఆర్థిక విధానాల వరకు కనిపిస్తుంది.ప్రపంచం మరో మహాయుద్ధం అంచుల వైపు వెళ్లకూడదంటే వివేకం, సంయమనం, దౌత్యంగెలవాలి. ఆయుధాలు కాదు, సంభాషణలే భవిష్యత్తును రక్షిస్తాయి.



ఉత్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.

# పోలీస్ తనిఖీలు ముమ్మరం

## సరిహద్దు చెక్‌పోస్టుల్లో భద్రతా ఏర్పాట్లపై సీపీ గౌష్ ఆలం ఆకస్మిక పరిశీలన

**కరీంనగర్, (సింగిడి):** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరి రక్షణతోపాటు అక్రమ రవాణాను అడ్డుకునేం దుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ చెక్‌పో స్టులను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద నిరం తర నిఘా కొనసాగించడంతో పాటు విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన మౌలిక వస తులు, భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచుతు న్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో కరీంనగర్ పరిధిలోని మగ్దూంపూర్ చెక్‌పో స్టును గురువారం అర్ధరాత్రి సీపీ స్వయంగా పరిశీలించారు. అక్కడ లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లు, తగిన లైటింగ్ సౌకర్యం మినహా కొన్ని రక్షణ పరికరాల కొరత ఉన్నట్లు గుర్తించి, వెంటనే



చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. శనివారం నుంచి ప్రతి చెక్‌పోస్టులో అవసరమైన అన్ని వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. రాత్రి తనిఖీల కోసం 3టార్చ్‌లైట్లు, మూడు ఎల్‌ఈడి బాటన్లు, అత్యవసర హెచ్చరికల కోసం విజి ల్స్, వాహనాలు, వ్యక్తుల కదలికలను పర్య వేక్షించేందుకు 2 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనంగా సిబ్బంది తప్పనిసరిగా లైట్ రిఫ్లెక్టర్ జాకెట్లు ధరించా లని, అత్యవసర సమాచార మార్పిడికి ప్రత్యేక కమ్యూనికేషన్ పరికరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వాహనాల వివ రాల నమోదు కోసం ప్రత్యేక రిజిస్టర్లు నిర్వ హించాలని సూచించారు. పండుగ సమ యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే ఈ తనిఖీల ఉద్దేశ్యమని సీపీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజలు, వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

# విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు కీలకం..

## మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్, సింగిడి:** కరీంనగర్ జిల్లా గ్రంథాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ఐదవ రోజు "గ్రంథాలయ దినోత్సవం" ఘనంగా జరిగింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో విద్యార్థులకు మెరుగైన అధ్యయన



వాతావరణం అందించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రూ. 7 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక గ్రంథాలయ భవనాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. విద్య, యువత ప్రోత్సాహానికి నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్పొరేటర్లు, అధికారులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# ప్రధాని పిలుపు తో సైకిల్ పై వార్డు సందర్శించిన మున్సిపల్ చైర్మన్

## దేశ భవిష్యత్తు కోసం ఇంధనాన్ని ఆదా చేదాం.. మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, (సింగిడి):** భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ శుక్రవారం సైకిల్‌పై పర్యటిస్తూ పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి కార్యాలయ సిబ్బందితో కలిసి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, భారత ప్రధాని దేశ భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలో భాగంగా ఇంధనాన్ని పొదుపు చేయాలని సూచించగా దానిని ఆద ర్శంగా తీసుకొని కనీసం రోజుకు రెండు మూడు గంటలైనా సైకిల్ పై ప్రయాణిస్తూ ఇంధనాన్ని ఆదా చేయాలని సూచించారు. ప్రతి చిన్న పనికి వాహనాలను వాడకుండా వీలైనంతవరకు సైకిల్ పై ప్రయాణం చేయాలని లేదంటే నడుచుకుంటూ వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకోవాలని అన్నారు. ప్రధాని మాటల్లో నిజం ఉందని రాబోయే రోజుల్లో ఇంధనాన్ని పొదుపు చేయకపోతే తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అవసరమైతే తప్ప వాహనాలను వాడకూడదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున స్వామి, స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మహేష్, సదా నందం ఏఈ వికాస్ తదితరులు పాల్గొన్నారు..

# మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

**కరీంనగర్, సింగిడి:** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న తెలిపారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డును పరిశీలించిన ఆయన, పారిశుధ్య నిర్వహణ పై అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. రెండు నుంచి మూడు రోజుల్లో యార్డు మొత్తం శుభ్రపరిచే పనులు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆకుల నరసన్న అన్నారు. ప్రభుత్వం



రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. చివరి గింజ వరకు వరి, మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు.

# బార్ అండ్ రెస్టారెంట్‌లలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**జమ్మికుంట, (సింగిడి) :** హుజురాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్లలో మున్సిపల్ కమిషనర్ బి కిషన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని స్వాగత్, అవంతి నాగేంద్ర బార్ అండ్ రెస్టారెంట్లలో కమీషనర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రెస్టారెంట్లకు వచ్చే కస్టమర్లకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. బార్ అండ్ రెస్టారెంట్లను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించకూడదని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని నిర్వాహకులకు సూచించారు. ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదని రెస్టారెంట్లలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలం చెల్లిన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందించ కూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ దరిపల్లి కిరణ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ తో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్య పశు యజమానులపై కేసులు నమోదు

## ప్రజల భద్రతతో ఆటలాడితే ఉపేక్షించం: ఎస్ఐ మహేష్



**ధర్మపురి (సింగిడి):** పట్టణంలో రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్న పశువుల విషయంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు కఠిన వైఖరి అవలంబి స్తున్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివా రణ దృష్ట్యా పశువులను రోడ్లపై వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మపురి ఎస్సై జి మహేష్ హెచ్చరించారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో చాలా మంది యజమానులు బాధ్యతగా స్పందించి తమ పశువులను సంరక్షిం చుకున్నప్పటికీ, కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై మూడు ఆవులు స్వేచ్ఛగా తిరుగుతూ వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు గుర్తించ డంతో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సంయు క్తంగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆ మూడు ఆవులను సురక్షితంగా తాటిపల్లి గోశాలకు తరలించారు. సంబంధిత పశు వుల యజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుం టున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలిగించే విధంగా పశు వులను రోడ్లపై వదిలే యడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో శాంతిభద్ర తలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత పరిరక్షణకు అధికారులకు సహకరించాలని ఎస్సై మహేష్ కోరారు.

# మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

## రైతులకు ఇబ్బందులు కలుగొద్దు.. కొనుగోలు చేసిన మక్కలను గోదాంకు వెంటనే తరలించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**జమ్మికుంట (సింగిడి):** మక్కల కొను గోళ్లను వేగవంతంగా నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశిం చారు. కొనుగోలు చేసిన మక్కల బస్తాలను వెంట వెంటనే గోదాంలకు తరలించి భద్రపరచాలని సూచిం చారు. శుక్రవారం జమ్మికుంట మార్కెట్ యార్డు లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు లతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏమైనా ఇబ్బం దులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం రోజుకు ఎన్నిక్వింటాళ్ల మక్కలు కొను గోలు చేస్తున్నారు. గన్నీ బ్యాగుల కొరత ఉందా, రవాణా ప్రక్రియ ఎలా జరుగుతోందనే అంశా లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకు న్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయవ ద్దని స్పష్టం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల కష్టం పంట





రూపంలో వస్తుందని, అందువల్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారు లకు సూచించారు. లోడ్‌చేసిన బస్తాలను వెంటనే గోదాంలకు తరలించాలని, గోదాంలో నిల్వ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదే శించారు. మార్కెట్ యార్డుపక్కన ఉన్న గోదాంను కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో స్టోర్‌చేస్తున్న మక్కలబస్తాల నిర్వహణను పర్యవేక్షించి అధికా రులకు తగిన సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగ కుండా కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియను సమన్వయం తో నిర్వహిం చాలని తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతిబస్తాను సురక్షితంగా గోదాంలో భద్రపరచాలని, ఎప్పటి కప్పుడు లిఫ్టింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న, హుజురాబాద్ ఆర్డీవో కె రమేష్ బాబు, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహమ్మద్ షహబుద్దీన్ తహసీల్దార్ వెంకటరెడ్డితోపాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో గొప్పది

## హుస్నాబాద్ ఏసిపి సదానందం

**హుస్నాబాద్, (సింగిడి):** అక్కన్నపేట: సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీ ఎస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా, అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌటకుంట తండా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8 సిసి టివి కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఈరోజు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో సిసిటివి కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గ్రామంలో నిరంతర నిఘా ఉంచడం



ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని, ముఖ్యంగా దొంగతనాల నివారణలో ఇవి 'మూడవ కన్ను'లా పనిచేస్తాయని పేర్కొన్నారు. నేరస్థులలో భయం పెంచడమే కాకుండా, ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించి పట్టుకోవడానికి, కోర్టులో తిరుగులేని సాక్ష్యాధారాలను సమర్పిం చడానికి ఈ కెమెరాల ఫుటేజ్ ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ భద్రతను ఇచ్చే ఈసాంకేతికత మహిళలు, వృద్ధులు, చిన్నారుల రక్షణకు ఎంతోభరోసాని స్తుందని, గ్రామాల భద్రత కోసం ప్రజలు, యువత భాగస్వా మ్యంతో కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయ మని ఆయన కొనియాడారు. సిపి రష్మి పెరుమాళ్ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా భద్రతను మరింత కట్టు దిట్టం చేసేందుకు ఈ "సురక్ష నేత్ర" ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడు తుందని ఏసీపీ పునరుద్ఘా టించారు. కార్యక్రమంలో అక్కన్నపేట సబ్‌ఇన్స్పె క్టర్ చాత రాజు ప్రశాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు మా గోడు పట్టించుకోండమ్మా...

## జమ్మికుంటలో మక్కల రైతుల ఆవేదన..

**జమ్మికుంట, (సింగిడి):** పది రోజులుగా మక్కలను విక్రయించడానికి వచ్చి అధికారులు జాప్యం చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మా సమస్యను మీరైనా పట్టించుకోండి అమ్మా అంటూ రైతులు జమ్మికుంట పట్టణంలోని మక్కలు కొనుగోలు పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు గోడు వెళ్ళ బోసుకున్నారు. గన్ని సంచులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని కాంటాలు అయిన మక్కలను తరలించడంలో హమాలీల జాప్యం జరుగుతుండడంతో ఇక్కడే పడిగాపులు కాస్తున్నామని ఇప్పటికైనా స్పందించి మా సమస్యను పరిష్కరించాలంటూ రైతులు కలెక్టర్ ఎదుట తమ బాధను చెప్పుకున్నారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రైతులకు సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# కరీంనగర్‌లోనే ఉన్నత స్థాయి ఉద్యోగ శిక్షణలు

## జిల్లా గ్రంథాలయాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, సింగిడి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉద్యోగ శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా కరీంనగర్‌లోనే ఉన్నత స్థాయి నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా గ్రంథాలయాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన ప్రత్యేక శిక్షణలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో సమన్వయం చేసి నిరు ద్యోగ యువతకు ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. పుస్తక పఠనం జ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని, యువతలో చదివే అలవాటు మరింత పెరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ నిధులతో రూ. 7 కోట్ల వ్యయంతో జిల్లా గ్రంథాలయానికి నూతన భవనం సిద్ధమైందని, త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి నగరపాలక సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



మాట్లాడుతూ, గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానానికి కేంద్రాలుగా నిలుస్తా యని పేర్కొన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ, గ్రంథాల యం విద్యార్థులు, నిరుద్యోగులకు విజ్ఞాన వేదికగా మారిందన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పుస్తక పఠనాన్ని జీవితంలో భాగం చేసుకోవా లని సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రంథాలయానికి పుస్తకాలు అందజేశారు. అలాగే విద్యార్థుల సౌకర్యార్థం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ అందించిన ఎనిమిది కూలర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, కార్పొరేటర్ పడాల శ్రీజ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం ముందు దళితబంధు లబ్ధిదారుల ధర్నా

## రెండో విడత నిధుల కోసం కృషి చేస్తా...

## లబ్ధిదారులకు హామీ ఇచ్చిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట, సింగిడి :** గత టీఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం లో చాలామంది దళిత కుటుంబాలకు రెండో విడత నిధులు మంజూరు కాలేదు. మొదటి విడతలో వచ్చిన వారికి రెండో విడతలు దళిత బంధువులు నిధులు రాకపోవడంతో వారి వ్యాపారాలు పూర్తిగా నష్టపోతున్నామని ఇప్పటికే



చాలా దుకాణాలు మూతపడే దిశగా ఉన్నాయని మాకు రావాల్సిన దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ దళిత బంధు లబ్ధిదారులతో మాట్లాడి మీ సమస్యకు పరిష్కారం చూస్తానని ఉన్నతాధికారులతో మాట్లాడి రెండో విడత దళిత బంధు నిధులు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. దీంతో దళిత బంధు లబ్ధిదారులు మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం అందించి తమ నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి జావేద్ కమిషనర్ మల్లికార్జున స్వామి కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్ చందా రాజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించిన ప్రిన్సిపల్


## విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శుక్రవారం పోటీ పరీక్షల గ్రంథాల యంను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ. రమేష్ ప్రారంభోత్సవం చేసారు. కళాశాలలో ప్రజాపా లన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకొని కళాశా లలో పోటీ పరీక్షల గ్రంథాలయంను ఏర్పాటు చేసారు. పోటీ పరీక్షల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తన స్వంత డబ్బులతో కోనుగోలు చేసిన పలు పోటీ పరీక్షల పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి బహుకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రామస్వామి, ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి , వైస్–ప్రిన్సిపాల్ ఐతీ. ఎస్ . ఓదెలు కుమార్, గ్రంథాలయ ఇంచార్జీ మమత, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా

# నర్సాగౌడ్ ప్రెస్‌క్లబ్ నేతల సన్మానం



**బుగ్గారం, (సింగిడి):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ నూతనఅధ్యక్షులుగా నగునూరి నర్సాగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, బుగ్గారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దూడ జీవన్, పాత్రికేయులు నక్క సతీష్, ఆర్ఎంపి అక్బర్ షరీఫ్‌లు బుగ్గారంలో కలిసి సన్మానించి శుభాకాం క్షలు తెలిపారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన నర్సాగౌడ్ నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కిషన్ రెడ్డి, జీవన్ లు ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై

# మున్సిపాలిటీ ఫోకస్

## ప్రత్యేక సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక



**ధర్మపురి (సింగిడి):** పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారం, మున్సిపల్ పాలన బలోపేతంపై ధర్మపురి పురపాలక సంఘం దృష్టి సారించింది. ఒకవైపు 12వ వార్డులో డ్రైనేజీ, తాగునీటి సమస్య లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, మరోవైపు పురపాలక సంఘ కార్యాల యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికను పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు చైర్‌పర్సన్ 12వ వార్డును సందర్శించి డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్న ఆమె, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగి స్తామని తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కో–ఆప్షన్ మూడవ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ నాలెడ్జ్ మహిళా కోటాలో ఆశెట్టి మమత, జనరల్ కోటాలో గరిగె అరుణ, మైనారిటీ మహిళా కోటాలో మొహ్మద్ నఫీజ్ సుల్తానా, జనరల్ కోటాలో షౌకత్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు, వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈ ధర్మరాజు, వార్డు కౌన్సిలర్ చుక్క సంధ్య, కౌన్సిల్ సభ్యులు, టౌన్ ప్లానింగ్ అధికారి కే శ్రీనివాస్, మేనేజర్ బాలే గంగాధర్, స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**బుగ్గారం, సింగిడి:** బుగ్గారం మండల కేంద్రంలో శుక్రవారం మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో నగునూరి తిరుపతి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా నక్క నాగేష్, ప్రధాన కార్యదర్శిగా సత్యం, రెడ్డి గౌరవ అధ్యక్షులుగా సురేష్, క్యాషియర్ గా రమేష్ సలహాదారులు బిక్కం రాజేష్, శివకుమార్, ఎస్ డి మోజావుద్దీన్, బాలరాజు రైటర్ గా చంద్రమౌళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఆటో యూనియన్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి ఇద్దరు బాలల మృతి

**వెల్దుర్తి, (సింగిడి):** వేసవి సెలవులు కావడంతో సరదా కోసం ఈతకు వెళ్లి ఇద్దరు బాలు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్ స్టేషన్ శివారులోని మాసాయిపేట్ మండల పరిధిలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట చిన్న కిషోర్, నాగోళ్ళ భాను ఇద్దరూ కలిసి సరదాగా ఈతకు వెళ్లారు. హకీంపేటలోని క్వారీ గుంతలో పడి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాలు తూప్రాన్ హాస్పిటల్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై చైతన్య రెడి తెలిపారు.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఒ నిజం
Singidi
సోమవారం 22-6-2026

# చివరిగింజ వరకూ కొంటాం..: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి




ధాన్యం కొనుగోళ్లకు రూ.22 వేల కోట్ల భారీ కేటాయింపు

తాలు..తరుగు కటింగ్‌లు చేస్తే రైస్ మిల్లులు సీజ్

ఖమ్మం ఐడిఓసిలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన మంత్రులు

**ఖమ్మం ప్రతినిధి, (సింగిడి):** రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, [illegible] వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ. 22 వేల కోట్ల నిధులను సిద్ధంగా ఉంచిందని వెల్లడించారు. ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి రైతులకు రూ. 4,800 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సుమారు రూ. 45 వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. [illegible] తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.... రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ప్రభుత్వం కొంత నష్టాన్ని భరించేందుకైనా సిద్ధంగా ఉందన్నారు. కనీస మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వడంతో రైతులు రికార్డు స్థాయిలో వరి సాగు చేశారని తెలిపారు. [illegible] ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ... రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తున్న ప్రభుత్వం ఇదేనన్నారు. ప్రభుత్వం [illegible]ను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. [illegible] అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం, [illegible] కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో [illegible] ఖమ్మం జిల్లా అధికారులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించండి: మంత్రి ఉత్తంకు వినతి



**ఖమ్మం, (సింగిడి):** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి తక్షణమే తగిన కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఐ అధ్వర్యంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతి పత్రం -సమర్పించారు. గురువారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షకు ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చిన సందర్భంగా శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు నేతృత్వంలో వినతి పత్రం సమర్పించారు. [illegible] మిల్లర్లు తరుగు పేరుతో రైతులను [illegible] క్వింటాకు ఐదు నుంచి 11కేజీల వరకు కోత విధిస్తున్నారని దీనిని తక్షణం నిరోధించాలని మంత్రిని కోరారు. మొక్కజొన్న కొనుగోళ్లలో సైతం ఇబ్బందులను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతుందని నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఎస్కె జానిమియా, ఏపూరి – రవీంద్రబాబు, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, దొబ్బల వెంగళరావు, మల్లికార్జున్, వరదా నర్సింహారావు, గోపాలరావు, తదితరులు ఉన్నారు.

## ఏర్గట్లలో బడిబాట ర్యాలీ...



**ఆర్మూర్, (సింగిడి):** గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో గల పి.ఎం. శ్రీ, జడ్పీ హెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ఏరుగట్ల ఆధ్వర్యంలో గురువారం రోజున బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఏరుగట్ల గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించామని ఏరుగట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కొమరగిరి కృష్ణచారి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివితే కలిగే ప్రయోజనాలను, స్థానికులకు పాఠశాల బృం దం విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పాఠశాలకు సంబంధిం చిన కరపత్రాలు పంచామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్త కాలు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందిస్తున్న విషయాన్ని గ్రామస్తు లకు, విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల బృందం వివరించింది. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని తెలియజేసేలా విద్యార్థులు ర్యాలీలో చేసిన నినాదాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ బడిబాట ర్యాలీ, ఇంటికి ప్రచారం నిర్వహించిన ఉపా ధ్యాయ బృందాన్ని, ఏరుగట్ల గ్రామంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్థానిక సర్పంచ్ ఉపేందర్ రెడ్డి పూల మాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, ప్రసాద్, రాజశేఖర్, సమిత, ఎస్ శ్రీనివాస్, విజయ్, గంగాధర్, ప్రవీణ్ కుమార్, రాజేందర్, కే శ్రీనివాస్, నరేష్, గంగా మోహన్, కోమలి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల పంపిణీ



**వైరా, (సింగిడి)::** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులకు ఆ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు, డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థినీ విద్యార్థులను అభినందించి అనంతరం శాలువాలు కప్పి సత్కరించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఉన్నత విద్యావంతులు అవ్వాలని, ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేందర్ రావు, వాంకుడోత్ భీక్యా, తేజావత్ నాగేశ్వరరావు, హుస్సేన్, పృథ్వి, దుర్గా నాయక్, దర్గయ్య,, గోపి, బాల్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.


## పడకల్‌లో ఘనంగా బడిబాట

కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా బడిబాట కార్యక్రమం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి హాజరై బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వారు ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి గ్రామంలో బడిబాట కార్యక్రమం నినాదాలు చేస్తూ పర్యటించారు. వారు మాట్లాడుతూ. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని విద్యతోనే ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని వారు కొనియాడారు. విద్య ద్వారా పేదరిక నిర్మూలనతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహిం చవచ్చని విద్యతో సమాజంలో కీర్తి ప్రతిష్టలు పొందవచ్చని వారు తెలిపారు. నేటి సమాజంలో డబ్బుతో కొనలేనిది విద్య ఒక్కటే అని వారు సూచించారు. కాబట్టి చిన్నారులందరని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించా లని గ్రామంలోని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఉపసర్పంచ్ జీనుకుంట్ల రాఘవేందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాందాస్ మరియు శ్రీనివాస్ సార్ , పాఠశాల చైర్మన్ స్వాతి వార్డ్ సభ్యులు జోగు విజయ్, జల్లెల సుహాసిని, లత్తుపల్లి వసంత, అబ్దుల్ వాజీద్,బండగల్ల చందు, బూరిగాళ్ల రాధిక, చౌటి విమల,జెనిగే నర్సింహా, చౌటి విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుళ్ళ తిరుపతి, బషీర్, లక్ష్మీనారాయణ, సత్తాయ,మహేష్, యాదయ్య మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి జగ్గారెడ్డి, మాజీ సర్పంచ్ చౌటి రమేష్ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## జక్రాన్‌పల్లి మాడల్ స్కూల్లో విద్యావారోత్సవాలు




**నిజామాబాద్ (సింగిడి)::** విద్యా వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యా సంచాలకుని ఆదేశాల మేరకు గురువారం జక్రాన్ పల్లి తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ లో ర్యాలీ నిర్వహించి, తరగతి టాపర్లకు, పాఠశాల టాపర్లకు బహుమతులు అందజేశారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించబడ్డాయి. పిల్లల తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధారాణి, కంచరి రవికుమార్, ఇఫ్రా, గంగరాజు, నజీర్, సత్యం, సాధికా, శంకర్, సుకన్య, బాలరాజు, సాయి, రహీం, సురేష్, రాజేష్, సుదర్శన్, వివేక్, మురళీధర్ , నవీన్, స్రవంతి తదితర టీచర్లు తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

# జమ్ములమ్మ ఆలయ పరిసరాల్లో చెత్త ఉండొద్దు

ప్రత్యేక కార్యాచరణతో పరిశుభ్రతకు సహకరించాలి

జమ్ములమ్మ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

ట్రాఫిక్ జామ్ సమస్యలను అధిగమించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాలబ్యూరో,(సింగిడి):** జమ్ములమ్మ ఆలయ పరిసరాల్లో భారీగా చెత్త పేరుకుపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని,ప్రత్యేకకార్యాచర ణతో పరిశుభ్రతకు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్లో జమ్ములమ్మ ఆలయం వద్ద ఉన్న టెంట్ హౌస్ యజమానులు, సం బంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ జమ్ములమ్మ ఆలయానికి ప్రతి మంగళవారం వేలాదిగా భక్తులు తరలి వస్తుం టారని టెంట్లు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని పొందే యజ మానులు అక్కడి పరిసరాల్లో పేరుకుపోయే చెత్తను తరలించేందుకు తమ వంతుగాసహకరించాలన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వాడేసిన విస్తర్లు, గ్లాసులు, తదితర వ్యర్థాలతో అపరిశుభ్రత కారణంగా రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. సమీపం లోని జమ్ములమ్మ రిజర్వాయర్ లో కూడా గాలికి వ్యర్థా లు కలిసిపోయి నీరు కలుషితం అవుతుందన్నారు. కుక్కలు, పందులు పరిసరాల్లో తిరుగుతుండడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతు న్నాయన్నారు. టెంట్‌హౌస్ యజమానులు ఒక కమిటీగా ఏర్పడి చెత్త తీసివేసేందుకు సిబ్బందిని నియమించుకో వాలని లేని పక్షంలో మున్సిపాలిటీకి రుసుములు చెల్లించాల్సిం దిగా ఆదేశించారు. జమ్ములమ్మ ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండాలంటే ప్రత్యేక సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు చెత్తను తీసివేయాలన్నారు. భక్తులు టెంట్ లను క్రమ పద్ధతిలో వేసుకునేలా ప్రత్యేక కార్యా చరణ అవసరమని అందుకు అనుగుణంగా సంబం ధిత అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. జమ్ములమ్మ ఆలయా నికి వచ్చే భక్తులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు ఉత్పన్నవుతున్నాయని, సమస్యను అధిగమించడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. బెల్టు దుకాణాలు, కల్తీ కల్లు విక్రయాలపై కూడా నిఘా ఉంచాలన్నారు. జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీ లు, గోడపత్రికలను తొలగించాలని మున్సిపల్ కమిష నర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సి పల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, శానిటరీ ఇన్స్పెక్టర్ మన్సూర్,గద్వాల గ్రామీణ ఎస్సై శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతులతో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖాముఖి..

తేమ శాతం పరిశీలించి ధాన్యం తీసుకురావాలి

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**నాగర్ కర్నూల్ (సింగిడి) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం రాచాలపల్లి గ్రామ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గ్రామంలో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు వద్దకు వెళ్లి పంట దిగుబడి, ధాన్యం నాణ్యత, కొనుగోలు కేంద్రాలకు తరలింపు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు తప్పనిసరిగా తేమ శాతం సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత తేమ శాతం ఉన్న ధాన్యాన్నే వెంటనే కొనుగోలు చేస్తారని తెలిపారు. అలాగే ధాన్యంలో, రాళ్లు, మట్టి లేకుండా శుభ్రంగా ఉంచితే కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని వివరించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరుగుతుందని, ధాన్యం సేకరణ పూర్తైన తర్వాత 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం గుడి గాని పల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదకరంగా మారిన భవనాన్ని తొలగించి, నూతన పాఠశాల భవన అనుమతులు ఇవ్వాలని కోరగా, అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీవో శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఉరుకొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కల్వకుర్తి సింగిడి:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సీసీఈ ఆదేశాల మేరకు విద్యా వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు గురువారం కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శార్వాణి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2008 నుండి 2026 వరకు డిగ్రీ విద్యను పూర్తి చేసిన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి అధ్యక్షునిగా ఆరిఫ్ని నియమించారు. వీరి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులందరూ ఒక గ్రూపుగా ఏర్పడి కళాశాలకు తమ సహాయ సహకారాలు అందించి కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల అధ్యక్షునిగా ఎన్నికైన ఆరిఫ్ ని కళాశాల తరపున శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి...

కమ్మర్పల్లి పోలీసుల అవగాహన...



**ఆర్మూర్,(సింగిడి):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన కమ్మర్పల్లిలో గురువారం కమ్మర్పల్లి మండల ఎస్సై, జి. అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్మర్పల్లి పోలీసులు సైబర్ సురక్ష జాతీయ భద్రత పై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి, అవగాహన కల్పించారు. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ, డిస్టర్బ్ జీవంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, గ్రామ ప్రజలు, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. తెలంగాణ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ కేంద్ర సహకారంతో సైబర్ సురక్ష – జాతీయ భద్రత నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ఉండేందుకై గ్రామస్తులకు పోలీసులు పలు సూచనలు, సలహాలు సూచిస్తూ జాగ్రత్త గా ఉండాలని వివరించారు. జాతీయ భద్రతకు కూడా ముప్పుగా ఫైబర్ నేరాలు మారుతు న్నాయని, ప్రతి పౌరుడు బాధ్యతయుతంగా ఫైబర్ నేరాల పట్ల మోసపోకుండా అవగా హన పెంపొందించుకోవాల న్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. క్రైమ్ పోర్టల్ లో సైతం ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.


## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



**వైరా (సింగిడి):** వైరా బస్టాండ్‌లో గురువారం రేచర్ల సైదులు, భాగ్యలక్ష్మి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎస్సై పుప్పాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావ్, రేచర్ల వెంకటేష్, జానయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు కోర్టు ఆవరణంలో న్యాయ చైతన్య సదస్సు

మానవ అక్రమ రవాణా, ఫోక్స్ చట్టాలపై అవగాహన.. సదస్సులో పాల్గొన్న మెజిస్ట్రేట్






**మణుగూరు, సింగిడి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు కోర్ట్ ఆవరణంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్ ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూర్రెడ్డి పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా,వాణిజ్య దోపిడీ నిరోధక పథకం-2017 సంవత్సరం కింద బాధితులకు అందించే న్యాయ సహాయం రక్షణ చర్యలు ప్రభుత్వ పునరావాస అవకాశాలు గురించి ఆయన వివరించారు. అలాగే జాగృతి పథకం 2025లో భాగంగా సురక్షిత్ బచ్పన్-సురక్షిత్ భవిష్యత్ కార్యక్రమం ద్వారా చిన్నారులకు రక్షణ, మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఫోక్స్ చట్ట నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవా లని లీగల్ ఎయిడ్స్ కౌన్సిల్ సభ్యురాలు పద్మావతి సూచించారు. కోర్టు ఆవరణంలో పేదలకు ఉచిత న్యాయ సలహా అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు కక్షిదారులు కోర్టుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబ్యునల్ కమిటీ మెంబర్‌గా బాస వేణుగోపాల్ నియామకం

పలువురు రాష్ట్ర,మండల కాంగ్రెస్ నాయకుల సన్మానాలు,శుభాకాంక్షలు...



**ఆర్మూర్, సింగిడి:** తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ కమిటీ మెంబర్గ బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాస వేణుగోపాల్ యాదవ్ రాష్ట్ర టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి కృషి ఫలితంగా నియా మకమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ కమిటీ మెంబరా నియామకమైన బాస వేణుగోపాల్ యాదవ్‌ను గురువారం హైదరాబాదు లోని టీజీఎండిసి కార్యాలయంలో రాష్ట్ర టీజీ ఎం డిసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు, రాష్ట్ర సహ కార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వ పంచాయ తీరాజ్ క్రిమినల్ కమిటీ మెంబర్ భాష వేణు గోపాల్ యాదవ్ రాష్ట్ర చైర్మన్ లను సన్మానించి అభినందించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రిబ్యునల్ కమిటీ మెంబరా నియామకమైన భాష వేణుగోపాల్ యాదవ్‌ను గురువారం రోజున బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గున్నాల వెంకటేష్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులు ఆరెపల్లి గంగాధర్, మరికొందరు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లి ట్రిబనల్ మెంబర్ కమిటీగా నియామకమైన బాస వేణుగోపాల్ యాదవ్ ను పూలమాలలు వేసి, సాల్వలు కప్పి, ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## అమర్నాథ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు...

ఆరోగ్య ధృవీకరణ పత్రాలు అందజేసిన నాగర్ కర్నూల్ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ టి. ఉషారాణి.



**నాగర్ కర్నూల్, సింగిడి:** నాగర్ కర్నూల్ జిల్లా నుండి అమర్నాథ్ యాత్రకు వెళుతున్న భక్తులకు కావలసిన ధృవీకరణ పత్రాలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గురువారం నాడు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి అమ ర్నాథ్ యాత్రకు వెళ్ళుటకు ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు ఆసుపత్రి సూపరిటెంట్ డాక్టర్ టి. ఉషారాణి తెలిపారు. అమర్నాథ్ వెళ్తున్న యాత్రికులను స్వయంగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరిటెంట్ పరీక్షించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి పలు ఆరోగ్య సూచ నలు చేశారు. అమర్నాథ్, కేదార్నాథ్ , చార్ ధాం వెళ్తున్న భక్తులు వారికి ఆరోగ్య ధృవీకరణ పత్రాలు అన్ని పరీక్షలు నిర్వహించి ఇవ్వనున్న ట్లు తెలిపారు. కార్యక్రమం లో జనరల్ ఫిజిషి యన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోనాదేవి, డాక్టర్ నికిత,సహాయ సంచాలకులు సీజే వసంత్ కుమార్,ఆర్.ఎం. ఓ. డాక్టర్ ప్రశాంత్, నర్సింగ్ సూపరిటెంట్ మంజుల,పద్మ, హెల్ప్ డెస్క్ఇంచార్జ్ టి. యాదగిరి, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
22-6-2026

# త్రిపుల్ మర్డర్ కేసును ఛేదించిన నల్గొండ జిల్లా పోలీసులు

## సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్

### ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్లగొండ ప్రతినిధి జూన్ 21(సింగిడి):** మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల 4వ తేదీన జరిగిన అగ్నిప్రమాద ఘటన వెనుక పథకం ప్రకారం జరిగిన త్రిపుల్ మర్డర్ కేసును నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా భావించిన ఈ ఘటనను అత్యాధునిక సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల సహాయంతో దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్ళపాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు వివాహ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని వారి నమ్మకాన్ని సంపాదించి ఆర్థిక ప్రయోజనాలు పొందడం అలవాటుగా మార్చుకున్నాడు. ఇదే విధంగా బాధితురాలు ధనలక్ష్మితో పరిచయం ఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడు. కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. గతంలో తనపై నమోదైన కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు సహకరించలేదన్న ఆగ్రహంతో ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులను హత్య చేయాలని నిందితుడు ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన రోజు ఉదయం తన నివాసం సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించిన నిందితుడు, మార్గమధ్యంలో ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ నింపించుకున్నాడు. అనంతరం రాత్రి సమయంలో బాధితుల ఇంటికి చేరుకుని అందరూ నిద్రలో ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించి ప్లాస్టిక్ బకెట్‌లో ఉన్న పెట్రోల్‌ను వారిపై చల్లి నిప్పంటించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో బాధితురాలు ధనలక్ష్మి ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17), కుమార్తె ప్రణతి (15) మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు, కాలిపోయిన ఇంటి వెనుక భాగంలో గుర్తించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్, వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలు, నిందితుడి ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, పాక్షికంగా కాలిపోయిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఘటనాస్థలంలో వదిలివెళ్లిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్లిష్టమైన కేసును వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి, మిర్యాలగూడ ఐ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను ప్రకటించారు.

# ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు తండా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి

### తండా సర్పంచ్ భూక్యా జానకి రాములునాయక్



**డోర్నకల్ /మరిపెడ జూన్ 21(సింగిడి):** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రి తండ గ్రామపంచాయతీ లో ముత్యాలమ్మ గుడి పండుగ ఏడవ వార్షికోత్సవాన్ని సర్పంచ్ భూక్యా జానకి రాములు నాయక్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. తండా ప్రజలను సుభిక్షంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండే విధంగా ఆ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మొక్కుకున్నారు. గ్రామదేవతలుగా తండాల్లో వెలిసి కోరిన భక్తులకు కోర్కెలు తీర్చే తల్లిగా ముత్యాలమ్మ ను భక్తులు ఎంతో ఇష్టంగా కొలుచుకుంటారు. ప్రతి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలో కాంగ్రెస్ పార్టీ తండా నాయకులు భూక్యా వేంకన్నా నాయక్,తండ ప్రజలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్‌సార్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరం పనిచేద్దాం

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జూన్ 21(సింగిడి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణకర్త, మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని జయశంకర్ సార్ విగ్రహానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పి, ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన గొప్ప తాత్వికవేత్తగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ సార్ చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలు, ఎం.నర్సిరెడ్డి, దేశిడి శేఖర్ రెడ్డి, బసవయ్య గౌడ్, వెంకటేష్ గౌడ్, షేక్ అబ్దుల్లా,డి.రవితేజ, నాగునాయక్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎ.నాగార్జునచారి, లక్ష్మణ్, గడగొజు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొని జయశంకర్ సార్‌కు ఘన నివాళులర్పించారు.

## గ్రామ పంచాయతీ పాలకవర్గం శ్రమదానం



**కమలాపూర్, జూన్ 21 (సింగిడి):** మండలంలోని మాదన్నపేట గ్రామంలో ఆదివారం గ్రామ పంచాయితీ పాలక వర్గం ఊరికోసం ఆదివారం శ్రమదానం అనే కార్యక్రమం ఎస్సి కాలనిలో నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనిలో రోడ్లు ఊడ్చి,మురికి కాలువలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తి రమేష్, వార్డ్ సభ్యులు ఓర్సు రాజు, బండి సదయ్య, మేకల కుమారస్వామి, గుండపు సురేష్, గ్రామ పంచాయితీ సిబ్బ సిబ్బంది ఆశ వర్కర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ, జూన్ 21(సింగిడి):** మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవం కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బి ఎల్ ఆర్, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ యోగాసనాలు చేసి, కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమన్నారు. యోగ కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడితో కూడిన జీవన విధానంలో ప్రతిఒక్కరూ యోగను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. యోగ ద్వారా ఆరోగ్యవంత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. యువత, అన్ని వయసుల వారు యోగా భ్యాసాన్ని అలవర్చుకోవాలన్నారు. యోగ దినోత్సవంలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు, యోగా సాధకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రతినిధులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేకశ్రద్ధ

### సర్పంచ్ పుష్పలత



**మహదేవపూర్, జూన్ 21 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి అన్నారు. వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు సోకకుండా ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా ఆమె పంచాయితీ కార్యదర్శి లేకున్నా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న తీరు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి తో పాటు ప్రజల ఆరోగ్యం పట్ల పూడికతీత పనులు, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దందేర రాజేందర్,సురేష్,జవ్వాజి తిరుపతితోపాటు పలువురు పాల్గొన్నారు.

# కైరంకొండ సరిత-గిరిల సౌజన్యంతో నోట్‌బుక్స్ పంపిణీ




**హనుమకొండ, జూన్ 21 (సింగిడి):** ఫాదర్స్ డేను పురస్కరించుకొని ఆదివారం గోల్డెన్ కిడ్స్ ఫౌండేషన్ యూఎస్ఏ అధినేత కైరంకొండ సరిత-గిరి సౌజన్యంతో గంగపుత్ర, నిరుపేద విద్యార్థులకు ఆదివారం ఉచిత నోట్ బుక్స్ పంపిణి కార్యక్రమం హన్మకొండ లోని వరంగల్ గంగ పుత్ర హౌజింగ్ సొసైటీ, అలంకార్ సెంటర్లో జరిగింది. సొసైటీ అధక్షులు, డోలి రాజలింగం - కనకమ్మ దంపతులు నిరుపేద విద్యార్థులకు యుఎస్ఏ ఫౌండేషన్ అధినేత సరిత ఆధ్వర్యంలో దాదాపు 100 మంది పేద విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, ఇతర సామాగ్రిని అందజేసినారు. ఈ సంధర్భముగా రిటైర్డ్ లెక్చరర్ రాజలింగం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణ అలవర్చు కొని ఆసక్తితో విద్యను అభ్యసించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమనీకి హాజరైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఫౌండేషన్ నేతృత్వంలో సహా పంక్తి భోజనాన్ని ఏర్పాటు వేశారు. ఈ సభకు ముఖ్య అతిధులుగా సొసైటి కార్య దర్శి పారిపెల్లి రాజేంద్ర కుమార్- సుచిత్ర, ఎలు గు వెంకటేశ్వర్లు , అంబటి రాశీ నారాయణ, సభ్యులు సరోజన, బయ్యా అనిల్ , పాక వెంకటేశ్వర్లు, మహేశ్, నరేశ్, అంపటి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### మహాదేవపూర్‌లో యోగా దినోత్సవం



**మహాదేవపూర్,(సింగిడి):** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జయయశంకర్ భూపాలపల్లి మహాదేవ పూర్ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి స్థానిక సర్పంచ్ హసీనా భాను, ఉపస ర్పంచ్ తుంగల శ్రీజ ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. వారు మాట్లాడుతూ దేశం ఆరోగ్యవంతంగా ఉండాలంటే పిల్లల నుండి పెద్దల వరకు ప్రతీ వ్యక్తి రోజూ కనీసం ఒక అరగంట యోగాసనాలు, ధ్యానం చేస్తే ఆరో గ్యాంగా ఉంటారని, ఏలాంటి జబ్బులు రాకుండా ఆరోగ్యం గా ఉంటారని అన్నారు. యోగా హసనాలతో వ్యక్తి ఆరోగ్యాంగా ఉంటారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

## ఘనంగా యోగ దినోత్సవం



**కోదాడ,జూన్ 21 (సింగిడి):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అనంతగిరి మండలం గొండ్రియాల, పాలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, మీరావలి, వెంకటరత్నం, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు పేర్కొన్నారు.

# యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

### ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం



**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 21(సింగిడి):** యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్ లో యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ అనే ఇతివృత్తంతో జిల్లా స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, అధికారులు యోగ ఆసనాలు చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని, ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతర యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, ఆరోగ్య, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి తోడ్పడుతుందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న, పెద్దల వరకు ప్రతి ఒక్కరూ సాధన చేయాలని అన్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాల వల్ల ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా వ్యర్థమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే మహాభాగ్యమని మనిషికి బలమైన పునాది ఆరోగ్యమని అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# యోగతో ఆరోగ్యానికి భరోసా

## ఆలేరు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం




**ఆలేరు, జూన్ 21(సింగిడి):** యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, తనువును, మనస్సును, ఆత్మను ఏకం చేసే గొప్ప సాధనమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పెరుగుతున్న శారీరక, మానసిక ఒత్తిళ్లను అధిగమించేందుకు యోగా అత్యంత ప్రభావవం తమైన మార్గమని వారు అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే యోగ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యోగకు పెరుగుతున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానంలో నిలుస్తోందని, ఇతర వ్యాయామాలతో పోల్చితే యోగాలో ఉన్న ప్రత్యేకతలు దానిని మరింత విశిష్టంగా నిలబెడుతున్నాయని వివరించారు. యోగా మన సంస్కృతి, మన వారసత్వ సంపద అని, దీనిని నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని తెలిపారు. భారతదేశ ప్రజలకు ప్రాచీన కాలం నుంచి లభించిన అమూల్యమైన వారసత్వ సంపద యోగ అని, గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు, ఆరోగ్య నిపుణులు సైతం యోగను సూచిస్తున్నారని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వివరించారు. ఎన్‌సీసీ కాడెట్లతో యోగాసనాలు, ప్రాణాయా మం, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేఘరాజు, ఎన్‌సీసీ కాడెట్లు వరుణ్, సంజయ్, ఉమేష్, రేచల్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (సింగిడి):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నీట్--2026 పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్ ఆదివారం పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షకేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అభ్యర్థుల ప్రవేశ విధానం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అత్యవసర సేవల అందుబాటు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా నిబంధనలను పాటిస్తూ సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ తరపున నీట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు ఆయన వెంట పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు అండగా ప్రభుత్వం

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ఆలేరు, జూన్ 21 సింగిడి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సాధికారత, పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మహిళా సంఘ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని బీల్యా నాయక్ తండా, మాదాపురం, రుస్తాపురం, రాంపురం, తిరుమలపురం గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడే భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక పురోగతిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం ముల్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫోటో క్యాప్షన్: తుర్కపల్లి మండలంలోని ముల్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో లబ్ధిదారులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి నిత్య కళ్యాణం



**హుజూర్‌నగర్ మఠంపల్లి, జూన్ 21(సింగిడి):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు ఆదివారం శ్రీ స్వామి వారికి ప్రాతఃకాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి నిత్య కళ్యాణం దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభచా ర్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. దేవాలయం అన్నదానంలో 110మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

# శనిగరంలో యోగా డే..



**కమలాపూర్, జూన్ 21 (సింగిడి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం శనిగరం ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ,వైద్యాధి కారి డా కె ఝాన్సి ప్రియాంక ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో యోగా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కొత్తపల్లి రాజు, ఉప సర్పంచ్ భరత్, యోగా ఇన్‌స్ట్రక్టర్స్ పద్మ, చంటి,ఎ ఎన్ ఎం సంపూర్ణ, ఆశా వర్కర్లు, రమ, శ్రీలత,అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ ఈఓగా చలపతి



**హుజూర్‌నగర్ (మఠంపల్లి), జూన్ 21 (సింగిడి):** లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రమునకు కమీషనరు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం వారి ఉత్తర్వుల ప్రకారము శ్రీమతి జ్యోతి, కార్యనిర్వహణాధికారి వారు బదిలీ కాగా వారి స్థానములో శ్రీ చెన్నకేశ స్వామి వారి దేవస్థానం, జనగాం టౌన్ కార్యనిర్వహణాధికారిగా పని చేయుచున్న శ్రీ టి.వి. చలపతి, వారు ఆదివారం అనువంశిక ధర్మకర్తలు శ్రీ చెన్నూరుమట్టపల్లి రావు, విజయ్కుమార్ వార్ల సమక్షములో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానము నందు కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించినారు.

## ప్రపంచానికి భారతీయ సంస్కృతి అందించిన గొప్పవరం యోగ

రాగిరి మోహన్ రెడ్డి



**నాచారం, జూన్ 21 (సింగిడి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నాచారం యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాల్యూ జోన్ ఆవరణలో నిర్వాహకులు మల్క ప్రకాష్, రాగిరి మోహన్ రెడ్డి, నవీన్ కుమార్ లు నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు రవి నాయక్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ సురేష్, మల్లెల నర్సింగ్ రావు కాటిపల్లి రవీందర్ రెడ్డి, దేవసాని బాలచందర్, బెక్కరి రవీందర్ రెడ్డి, రాంబాబు, అనుముల మహేష్, అనితా రెడ్డి, రవికాంత్, బొల్లం చంద్రమౌళి అభిషేక్ గౌడ్, ఉదయ్ కిరణ్ రెడ్డి, పాదం వెంకటేష్, రాజిరెడ్డి, రమేష్, ప్రతాప్ రెడ్డి జ్యోతి రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ యోగ శరీరానికి శక్తిని, మనసుకు ప్రశాంతతను అందించే భారతదేశపు అమూల్య సంపద. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, యోగ ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని తెలిపారు.

## గాంధీభవన్‌లో సంఘటన్ సృజన్ అభియాన్

ఎస్ఐఆర్‌పై సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జూన్ 21 (సింగిడి):** గాంధీ భవన్ లో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో సర్ పై బిఎల్ఎ లకు ఇచ్చిన శిక్షణ పై పార్లమెంట్ కోఆర్డినేటర్స్ సమావేశాన్ని నిర్వహించారు, ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ సర్ (ఎస్ఐఆర్ ) కార్యక్రమం, ఓటు మ్యాపింగ్ (బిఎల్ ఏ ఎస్ ) ల పాత్ర గురించి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు తీసుకోవలసిన అంశాలు, అనుసరించాల్సిన విధానంపై పార్లమెంట్ కోఆర్డినేటర్స్ కు దిశ నిర్దేశం చేశారు, సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బూతు లెవల్ ఏజెంట్లు అలసత్వం వహించకుండా ప్రతి ఇంటి తలుపు తడుతూ నకిలీ ఓట్లను తొలగింపు తో పాటు 18 సంవత్సరాలు నిండిన నూతన యువతి యువకులకు ఓటు హక్కును నమోదు చేసే విధంగా బిఎల్ఎలు కృషి చేసే విధంగా చూడాలని కోఆర్డినేటర్స్‌కి తెలిపారు. అనంతరం మాజీ శాసనసభ్యులు కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సర్, బిఎల్ఎ ల శిక్షణ గురించి పూర్తి వివరాలను ఏఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కు మహేష్ గౌడ్ కు పార్లమెంట్ పరిధిలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని విషయాలతో పాటు కరీంనగర్ పార్లమెం ట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని మండల కమిటీలు, డివిజన్ కమిటీ, మున్సిపల్ వార్డు కమిటీలు గ్రామ కమిటీల, నియామకాల గురించి వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సెక్రెటరీ సచిన్ సావంత్, ఎంపీచామల కిరణ్ రెడ్డి, సురేష్ షెట్కర్, రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

# నిత్య యవ్వనంగా ఉండాలంటే యోగ తప్పనిసరి

మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు

యోగాకు పుట్టినిల్లు భారతదేశం కలెక్టర్ హైమావతి







**సిద్ధిపేట బ్యూరో, జూన్ 21(సింగిడి):** ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హైమావతి నేతృత్వంలో ఆదివారం రోజున జిల్లా కేంద్రం లోని క్రికెట్ గ్రౌండ్‌లో 12వ అంతర్జాతీయ యోగ కార్యక్రమంను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హాజరయ్యారు.కార్యక్రమానికి జిల్లా అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్సిసి విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కలకత్తాలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన సందేశాన్ని స్క్రీన్‌పై ప్రదర్శించారు.అనంతరం యోగ గురువులు ఈ యోగ కార్యక్రమానికి హాజరైన వెయ్యి మందికి పైగా ప్రజలతో గంటసేపు వివిధ యోగాసనాలు వేయించారు. ముఖ్యఅతిథి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు మాట్లాడుతూ.. శరీరాన్ని ప్రేమిస్తూ నిత్య యవ్వనంగా ఉండాలంటే రోజూ యోగ చేయాలని సూచించారు.పనిఒత్తిడి మూలంగా చాలామంది ఉదయం త్వరగా లేచి ఎలాంటి శారీరక వ్యాయామాలు చేయడం లేదని ఆరోగ్య సంరక్షణ కోసం తప్పనిసరిగా ఎంత పని ఒత్తిడి ఉన్న ఉదయం 5 గంటలకు లేచి యోగ చెయ్యాలన్నారు. స్ట్రాంగ్ మైండ్ ఇన్ స్ట్రాంగ్ బాడీ అని ప్రఖ్యాత తత్వవేత్త అరిస్టాటిల్ ఎప్పుడో ఆరోగ్య సంరక్షణ కోసం చెప్పాడని అన్నారు. ప్రతి రోజు యోగా చేస్తే వయస్సు ఎరిగిన శరీరక ఉత్తేజాన్ని నిలుపుకోగలమని తెలిపారు.శారీరక శ్రమ లేకపోవడం ఎప్పుడు సెల్ ఫోన్ చూడడం మూలంగా చిన్నపిల్లలలో ఒబేసిటీ పెరుగుతుందని పిల్లలకు కూడా తప్పనిసరిగా యోగ చేయించాలని, సెల్ఫోన్ కు దూరంగా ఉంచాలని సూచించారు. శరీర ఆకృతి బాగుంటే ఎదుటివారి మన పైన పాజిటివ్గా ఉంటారని, నిత్యం యోగ చేస్తూ ఆరోగ్యవంతమైన అలవాట్లను పాటిస్తూ ఉద్యోగులు అయితే రిటైర్ అయిన తర్వాత కూడా కుటుంబంతో సంతోషంగా గడిపేలా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ లాంటి రాజకీయ నాయకులు 75 సంవత్సరాల లో కూడా ఎంత స్ట్రాంగ్ గా ఉన్నారంటే నిత్యం యోగ, ఆరోగ్యవంతమైన సాత్విక ఆహారం తీసుకోవడం కారణమని చెప్పారు. ఋషులు అందించిన భారతదేశ అతి ప్రాచీన ఆరోగ్య కార్యక్రమం యోగ అని అన్నారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తం యోగా కార్యక్రమం విస్తృతంగా ప్రచారం పొంది ఆచరిస్తున్నారని, యోగాకు పుట్టిల్లు అయిన భారత దేశంలో దాని ప్రభావం కోల్పోకుండా ప్రజలు తప్పకుండా ఆచరించేలా యోగ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే ఈ అంతర్జాతీయ యోగ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందని తెలిపారు.రొటీన్ గా కాకుండా ఇష్టంగా యోగ అభ్యసనం చెయ్యాలనీ, యోగతో పాటు సాత్వికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యోగదే నోడల్ అధికారి ఆయుష్ డాక్టర్ ఉమాదేవి, సిద్దిపేట ఆర్డిఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కంజర్లలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు షాక్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన 50 మంది నాయకులు, కార్యకర్తలు



**పటాన్చెరు, జూన్ 21(సింగిడి):** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలకు చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ ఊర్మిళ వెంకట్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. 50 మంది కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ప్రజలకు అర్థమైందని.. అతి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడతారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకపోగా హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తోందని విమర్శించారు. గత రెండున్నర సంవత్సరా లుగా పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో అధికార కాంగ్రెస్ పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంతో తిరిగి రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన విజయ్ సింగ్, హనుమంత్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సాయి, నరేష్ ఈశ్వర్, రాజు, లోకనాథ్‌సింగ్, కిరణ్, నబీ, తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఇంద్రేశం మున్సిపల్ కౌన్సిలర్లు ఊర్మిళ వెంకట్ రెడ్డి అంతిరెడ్డి, దుర్గారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, దుర్గేశ్, సాయికిరణ్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కార్యక్రమం దిగ్విజయం చేయండి


టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, జూన్ 21(సింగిడి):** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం కడ్తాల మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు సభవత్ బిచ్య నాయక్ స్థానిక కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి తో కలిసి శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్ళలాగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి కి రైతులకు, మహిళా సాధికారత కు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజక వర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందితుంది అన్నారు. సోమవారం రోజు ఉదయం 8:30 కు 1 కోటి రూపాయలతో కొత్తగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం ఎమ్మెల్యే అధ్యక్షతన ముఖ్య అతిథి గా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు దనసరి సీతక్క ఎంపీ మల్లు రవి గారితో కలిసి ప్రారంభోత్సవం చేస్తున్నారు. అ నంతరం తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి లో యూనియన్ బ్యాంక్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు డాక్టర్ మల్లు రవి ఎమ్మెల్యే గారితో కలిసి పాల్గొని ప్రారభించనున్నారు కాబట్టి కడ్తాల్ మండల కేంద్రం లో జరిగే కార్యక్రమం, గట్టుప్పలపల్లిలో జరిగే కార్యక్ర మానికి మంత్రి,ఎంపీ, ఎమ్మెల్యే, పాల్గొంటున్న కార్యక్రమలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ప్రజలు మరియు ప్రజలందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మాలే మల్లేష్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోసు రవి, వార్డు సభ్యులు జాంగిర్, బాబా, రమేష్, తుల్సిరాం నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ సమాజ సేవలు అమోగం

ప్రభుత్వ చిఫ్ విప్ మహేందర్ రెడ్డి



**వికారాబాద్, జూన్ 21(సింగిడి):** వీర శైవ సమాజం అందిస్తున్న సేవలు అమోగమని తెలంగాణ ప్రభుత్వ చిఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని తాండూర్ వీర శైవ సమాజం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షుడు గూళి పరమేశ్వర స్వామి, అధ్యక్షుడు తంబాకు శేఖర్, ఉపాధ్య క్షులు శెట్టి భాస్కర్, ప్రధాన కార్యదర్శి వాలి శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శి శశాంక్, కోశాధికారి కందనెల్లి ప్రకాశం, మరియు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. డాక్టర్ పట్నం మహేం దర్ రెడ్డి మాట్లాడుతూ, వీరశైవ సమాజం సామాజిక సేవలో ముందుండి పనిచేస్తోందని కొనియాడుతూ, సమాజ ఐక్యత, యువత అభివృద్ధి, విద్యా మరియు సంక్షేమ కార్యక్రమాల కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారు, చేవెళ్ళ ఎం.పి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి, ఏ ఎం సీ చైర్మన్ పట్లోళ్ల నర్సిములు, సమాజం పెద్దలు వీరశైవ యువ దల్ నాయకులు, స్థానిక కౌన్సిలర్ అంతారం కిరణ్, యువ నాయకులు బిర్కెట్ రఘు, అగ్గనూర్ సంకేత్, పవన్ ముదిరాజ్, రవి మరియు తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినచర్యలో భాగం కావాలి

పటాన్చెరులో అంగరంగ వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి







**పటాన్చెరు, జూన్ 21 (సింగిడి):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాది మందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో.. గత రెండు సంవత్సరాల నుండి మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక, ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపం చానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. విద్యార్థి దశ నుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్..**

తొలిమలి దశ తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించడంతోపాటు.. ప్రత్యేక తెలంగాణ సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య నృత్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందర్నీ అలరించింది. అనంతరం వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభగల పరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పటాన్చెరు సిఐ వినాయక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పరి శివుడు, నర్సింలు, సంజీవ రెడ్డి, మురళి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, పరమేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, యోగా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగా పరమ ఔషదం



**మిరుదొడ్డి,జూన్ 21(సింగిడి):** యోగా మార్గం ఆరోగ్య భాగ్యమనీ యునాని వైద్యాధికారినీ సానోబార్ సైదా అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రోజున నిర్వహించిన 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్గత శక్తి మేల్కొలిపే అమూల్య సాధనం యోగా అని చెప్పారు. యోగా అంటే ఆసనాలు వేయడమో ఊపిరి బిగపట్టడం కాదు.. జీవితాన్ని అధీనంలోకి తెచ్చుకోవడమని అన్నారు. ఆధునిక జీవన శైలితో కొని తెచ్చుకుంటున్న వ్యాధిని ఎదుర్కోవడానికి యోగా ఓ పరమ ఔషదం అని చెప్పారు. ఉరుకులు పరుగుల జీవితంలో ఆత్మకు స్వచ్ఛత మనసుకు ప్రశాంతత ఒంటికి వ్యాయామం ఏదీ ఉండలేదన్నారు. గాడితప్పిన శరీరాన్ని సరైన దారిలో పెట్టడానికి ఆసనాలు ఉపయోగ పడితే అంతర్గత శక్తి ప్రాణాయామ ధ్యానాలు దోహదం చేస్తాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ .నరేష్ కుమార్,యోగా ఇన్స్ట్రక్టర్ ప్రవీణ్ , యోగా శిక్షకురాలు స్వప్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయులకు హ్యూమన్ రైట్స్ కమిషన్ అండగా నిలవాలి



**కుత్బుల్లాపూర్,జూన్21(సింగిడి):** కుత్బుల్లా పూర్ నియోజకవర్గం (గాజులరామారం) మహాదేవ పురం డివిజన్‌లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ నవోదయ సిద్దార్థ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్ర మానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కొలను హనుమంతరెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో నిస్సహాయులకు, బాధితులకు అండగా నిలవడంలో మానవ హక్కుల రక్షణలో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వ హయాంలో చట్టానికి, మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా సంస్థ ప్రతినిధులు బాధ్యతా యుతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ముఖ్య ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**సిద్ధిపేట బ్యూరో, జూన్ 21(సింగిడి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకయోగా శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ముఖ్య కార్యదర్శి అతిథిగా పాల్గొని, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే పోలీస్ సిబ్బం దికి యోగా ఒక అద్భుతమైన ఔషధమని కొనియాడారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమె తెలిపారు. ఆరోగ్యకరమైన పోలీస్ బలగమే సురక్షితమైన సమాజానికి పునాది" అని సీపీ ఈసందర్భంగా నొక్కి చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడు కోవాలని, అందుకోసం యోగాను నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక యోగా సెషన్‌లో కమిషనరేట్ పరిధిలోని అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్, గజ్వేల్ ఏసిపి నర్సింలు, పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిపుణుల పర్యవేక్షణలో వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామం సాధన చేశారు.

## లయన్స్ క్లబ్ పిఆర్‌ఓగా పాష ఏకగ్రీవ ఎన్నిక



**ఆమనగల్లు, జూన్ 21(సింగిడి):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 18వ సారి పిఆర్ఓ గా ఎం ఏ. పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలను విస్తృత పరిచినందుకు గాను ఆయనకు మరోసారి అవకాశం వరించింది.. అంతర్జాతీయ స్థాయిలో మల్టిపుల్ రీజియన్ స్థాయిలో అవార్డులు ఎన్నో దక్కించుకున్నారు. తనపై నమ్మకం ఉంచి 18వ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు క్లబ్ మాజీ గవర్నర్ లు జి చెన్న కిషన్ రెడ్డి, జూలూరి రమేష్ బాబు, మల్టిపుల్ ఫాస్ట్ చైర్మన్ ఎస్ నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ వీరబొమ్మ బిక్షపతి, రీజియన్ చైర్మన్ సందడి జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, క్లబ్ అధ్యక్షులను క్లబ్ సభ్యులకు పాషా కృతజ్ఞతలు తెలిపారు.

## మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మమేకమైన కిషోర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 21 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ డివిజన్లో తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగులూరు కిషోర్ రెడ్డి స్థానిక ప్రజలతో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలు అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను వినడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం పనిచేయడమే తన లక్ష్యమని కిషోర్ రెడ్డి పేర్కొన్నారు.




# సోషియో ఫాంటసీగా నాగబంధం

## ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం

యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది. విజు వల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరి యన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# కాక్‌టెయిల్ 2 కుటుంబ కథా చిత్రం

షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2'. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శక త్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ. 13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

### మాఇంటి బంగారం

# ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్

సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ. 5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ. 6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ. 4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ. 10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ. 4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ. 90 లక్షలు, తమిళనాడులో రూ. 38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖి ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737